MAHILA SADHIKARATHA

# మహిళా సాధికారత

స్వయంసహాయ ఉద్యమ సమాచార తెలుగు మాస పత్రిక

mas

సంపుటి: 20 సంచిక: 2 రంగారెడ్డి డిసెంబర్ 2021 పేజీలు : 36 వెల : రూ. 10/-

## స్వయంసహాయ సమాఖ్యలపై ఏపిమాస్ జాతీయ కార్యశాల !





సమాఖ్యల 'విజన్ - 2030' నివేదికను ఆవిష్కరించి ప్రసంగిస్తున్న నాబార్డ్ చైర్మన్ డాక్టర్ జి ఆర్ చింతల



అవార్డు గ్రహీతలతో విశిష్ట అతిథులు, నిర్వాహకులు



క్షీర విప్లవ పితామహుడు డాక్టర్ కురియన్ శత జయంతి సందర్భంగా ఇర్మా' నిర్వహించిన సమావేశంలో శ్రీ సి ఎస్ రెడ్డి పాల్గొన్న దృశ్యం

NABARD

నాబార్డ్ సౌజన్యంతో

# కార్యశాలలో మరికొన్ని దృశ్యాలు



















మహిళా సాధికారత

సంపుటి 20 సంచిక 4



సంపాదకీయం

# కార్యశాల!

రెండు దశాబ్దాల క్రితం ఉవ్వెత్తున ఎగసిన స్వయంసహాయ ఉద్యమం ప్రస్తుతం కొంత మందకొడిగా సాగుతున్నదేమో అన్న విమర్శల మధ్య ఆ ఉద్యమంతో, ఆ సంస్థలతో ఎంతో అనుబంధం కలిగి, వాటి బలోపేతానికి ఏళ్ళతరబడి అంకితభావంతో కృషిచేసిన సంస్థగా ఏపిమాస్ దేశ వ్యాప్తంగా స్వయంసహాయ సమాఖ్యలను పునరుత్తేజితం చేయాలని, వచ్చే దశాబ్దంనాటికి ఈ సమాఖ్యలు స్వయంసమృద్ధికి, సుస్థిరాభివృద్ధికి, స్వయంశక్తికి, నూతనత్వానికి మారుపేరుగా నిలిచేలా ఎదగడానికి సమాయత్తంకావాలన్న సత్సంకల్పంతో వాటిలో చైతన్యం నింపడానికి ఏపిమాస్ నాబార్డ్ సంయుక్త భాగస్వామ్యంలో హైదరాబాదులో రెండు రోజులపాటు స్వయంసహాయ సమాఖ్యల కార్యశాలను నిర్వహించింది. ఈ కార్యశాలకు 17 రాష్ట్రాలనుంచి 150 మందికిపైగా సమాఖ్యల ప్రతినిధులు, యితర భాగస్వాములు హాజరై, సమాఖ్యల నిర్వహణలో తమ అనుభవాలు, సమస్యలు, సవాళ్ళు, అవకాశాలు, ఆశయాలు, ఆకాంక్షలను పరస్పరం పంచుకుని, ముమ్మరంగా చర్చించి, సమాఖ్యల విజన్ 2030 ని రూపొందించుకోవడం సంతోషదాయకమైన విషయం. ఈ జాతీయ కార్యశాల నిర్వహణకు ఏపిమాస్ కొన్ని నెలలుగా విశేషకృషిచేస్తూ వచ్చింది. దాతృత్వ సంస్థలు, భాగస్వామ్య సంస్థల తోడ్పాటుతో దేశ వ్యాప్తంగా స్వయంసహాయ సమాఖ్యలలో ఈ కార్యశాలపై సంప్రతింపులు, ప్రచారం నిర్వహించింది. జాతీయ స్థాయిలో, ప్రాంతీయ స్థాయిలలో ఉత్తమమైన సమాఖ్యలను ఎంపికచేసి, బహుమతులు యివ్వడానికి కొన్ని నిర్దిష్టమైన, ప్రామాణికమైన సూచీలను, కొలమానాలను నిర్దేశించి ఉత్తమ నిర్వహణకలిగిన సమాఖ్యలను దరఖాస్తు చేసుకోవలసిందిగా ఆహ్వానించి, నిపుణులైన న్యాయనిర్ణేతలతో వాటిని బేరీజువేయించి, వాటి పనితీరును నిగ్గుతేల్చి ఉత్తమ సమాఖ్యలకు ఏపిమాస్ అవార్డులను బహూకరించింది. ఈ పురస్కారాలు స్వయంసహాయ రంగంలో నూతనోత్తేజాన్ని నింపి స్వయంసహాయ సంఘాలు, సమాఖ్యలు మరింత సుస్థిరాభివృద్ధికి బాటలు వేయాలని ఏపిమాస్ ఆకాంక్షిస్తున్నది. పురస్కారాలను పొందిన సమాఖ్యలకు, వాటి పాలకవర్గాలకు, కార్యవర్గాలకు, సభ్యులకు ఏపిమాస్ అభినందనలు తెలియజేస్తున్నది. ఈ పురస్కారాలకోసం పోటీపడిన యితర సమాఖ్యలే కాకుండా, పోటీలో పాల్గొనని సమాఖ్యలు సైతం ఈ స్ఫూర్తితో ఉత్తమోత్తమ సమాఖ్యలుగా ఎదుగుతాయని ఏపిమాస్ ఆశిస్తున్నది. జాతీయ స్థాయిలో, ప్రాంతీయ స్థాయిలో మొత్తం 13 అవార్డులు అందజేయగా వాటిలో జాతీయస్థాయిలోని మొత్తం మూడు ఆవార్డులతోపాటు, ప్రాంతీయస్థాయిలోకూడా గణనీయంగా అవార్డులను ఏపిమాస్ నేరుగా లేదా భాగస్వామ్య సంస్థల మార్గదర్శకత్వంలో నిర్వహిస్తున్న సమాఖ్యలకు లభించడం ఏపిమాస్‌కు గర్వకారణమైన విషయం. అయితే, ఇంత సంతోషంలోకూడా మనస్తాపం కలిగించే విషయం, ఆశ్చర్యకరమైన విషయం ఉభయ తెలుగు రాష్ట్రాలలో ఏ ఒక్క సమాఖ్య కూడా ఆవార్డులకోసం కనీసం దరఖాస్తు చేయకపోవడం. ఒకనాడు యావత్ భారతదేశానికే స్వయంహాయ రంగంలో స్ఫూర్తిదాయకంగా నిలచిన తెలుగు రాష్ట్రాల స్వయంసహాయ సంస్థలలో యింతటి నిరాసక్తతకు కారణాలను అన్వేషించవలసి వుంది. స్వయంసహాయ సమాఖ్యలలో ఆశించిన ప్రగతి, చైతన్యం కొరవడడానికి ప్రభుత్వాలనుంచి వాటికి కావలసిన శాసనపరమైన మద్దతు లోపించడం ఒక ప్రధాన కారణమనేది కాదనలేని నిజం. ఆ ఆవశ్యకతను ఈ కార్యశాల ఎలుగెత్తి చాటింది. ఇప్పటికే కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు యిటువంటి శాసనాలు చేశాయి. మిగిలిన రాష్ట్రాలు యిప్పటికైనా మేల్కొని స్వయంసహాయ సమాఖ్యలకు మద్దతుగా తగిన శాసనాలు చేయాలని, చేస్తాయని ఆశిద్దాం. కార్యశాల రెండవరోజున అవార్డుల బహూకరణ సభకు స్వయంగా హాజరై, సమాఖ్యలకు కర్తవ్యబోధ చేసి, సభను జయప్రదంచేసిన నాబార్డ్ ఛైర్మన్ డాక్టర్ జి ఆర్ చింతల గారికి, ఇతర విశిష్ట అతిధులకు, తోడ్పాటు అందించిన డి జి ఆర్ వి, ఎనేబుల్, ఇతర దాతృత్వ, భాగస్వామ్య సంస్థలకు ఏపిమాస్ పాలకవర్గానికి, సిబ్బందికి, యిందులో పాత్రవహించినవారందరికి అభినందనపూర్వక ధన్యవాదాలు.

Edited, Printed, Published and owned by **T.Chandra Sekhar Reddy;** Printed at Kala Jyothi Process Pvt.Limited, S No:185, Kondapur, Hyderabad-500133, Ranga Reddi District, Telangana;Published at Mahila Abhivruddhi Society, Andhra Pradesh (APMAS), Plot No.11&12,HUDAColony, Tanesha Nagar, Near DreamVally,Manikonda,Rangareddi District,Hyderabad-500089. **Editor:**T.Chandra Sekhar Reddy

ఇతరులు నిన్ను అర్థం చేసుకోలేదని బాధపడడం కాదు, ముందుగా నిన్ను నీవు అర్థంచేసుకో

# మహిళా సాధికారత

ఎడిటర్ : **టి.చంద్రశేఖర రెడ్డి** అసోసియేట్ ఎడిటర్ : **జె.వి. క్రిష్ణమూర్తి**

ఎడిటోరియల్ కమిటి : ఏ. కళామణి, ఎస్. రామలక్ష్మి, ఎన్.వినాయకరెడ్డి, బి.వెంకటేశ్వర్లు

కంపోజింగ్, డిజైనింగ్ : ఎన్. రమాదేవి కన్సల్టెంట్ : కె.రఘురామరాజు

## లోపలి పేజీలలో ....


- ➪ ఎస్ హెచ్ జి సమాఖ్యల మహా సమ్మేళనం! ...05
- ➪ అవార్డులు పొందిన సమాఖ్యల వివరాలు ...09
- ➪ వ్యాపారాభివృద్ధితోనే రైతు సంస్థల మనుగడ ...10
- ➪ చిరుధాన్యాలకు అంతర్జాతీయ గుర్తింపు ! ...12
- ➪ సూది పురుగు దాడి నుంచి టమాటాకు రక్షణ! ...14
- ➪ గ్రామాలలో వినూత్న వ్యాపారాభివృద్ధికి తోడ్పాటు ...16
- ➪ సోలార్ హైడ్రో ఫోనిక్స్ ద్వారా గడ్డి పెంపకం ...18
- ➪ కొనుగోలు, అమ్మకందారుల పరిచయ వేదిక ...20
- ➪ ప్రభుత్వ శాఖలతో ధీశాలి సమావేశం! ...22
- ➪ వరి సాగును తగ్గించడం ఎలా? ...24
- ➪ కేంద్ర ప్రభుత్వ కార్మిక బీమా పథకం ...26
- ➪ గొర్రెలను వేధిస్తున్న కాలిపుండ్ల వ్యాధి ...27
- ➪ ధరణి ఎఫ్ పి ఓ కు బొలెరో వాహనం ! ...28
- ➪ అధిక వర్షాల ముప్పునుంచి పంటలకు రక్ష ణ ...29


### 'మహిళాభివృద్ధి సొసైటీ' (మాస్)

'**మ**హిళా సాధికారత' పత్రిక మాతృసంస్థ మహిళాభివృద్ధి సొసైటీ. దీనిని ఏపిమాస్ అని, మాస్ అని కూడా సంక్షిప్తంగా పిలుస్తారు. 2001జూన్ 14 వ తేదీన పబ్లిక్ సొసైటీగా మహిళాభివృద్ధి సొసైటీ హైదరాబాద్ ప్రధాన కార్యాలయంగా ఏర్పాటైంది. తెలుగు రాష్ట్రాలలో, మన దేశం లోని ఇతర అనేక రాష్ట్రాలలో స్వయంసహాయ సంస్థల సుస్థిరాభివృద్ధికి విశేష సేవలను అందించిన ఈ సంస్థ ప్రస్తుతం రైతుల అభ్యున్నతికి, పర్యావరణ పరిరక్షణకు, ఆదర్శ గ్రామాల నిర్మాణానికి, స్వయంసహాయ సంస్థల స్వయం నియంత్రణకు గణనీయమైన కృషి చేస్తున్నది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ప్రధాన కార్యదర్శిగా పనిచేసి పదవీ విరమణ చేసిన శ్రీ కె. మాధవరావు ఛైర్మన్‌గా వివిధ రంగాలలో విశేషానుభవం గడించిన ప్రముఖులు ఈ సంస్థ పాలకవర్గంలో వున్నారు. సంస్థ వ్యవస్థాపక సి ఇ ఓ శ్రీ సి ఎస్ రెడ్డి ఎండి గా, సిఇఓ గా వున్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, బీహార్‌లలో కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఈ సంస్థకు ప్రధాన కార్యాలయంతోపాటు, ఒక ప్రాంతీయ కార్యాలయం, 21 క్షేత్ర కార్యాలయాలు వున్నాయి. దాదాపు 250 మందికి పైగా సిబ్బంది వున్నారు. ప్రజలకు అవగాహన కలిగించడం కోసం మహిళా సాధికారత పత్రికతోపాటు వివిధ వైజ్ఞానిక పుస్తకాలను, ఈ సంస్థ ప్రచురిస్తుంటుంది.


| ప్రోత్సాహక చందా | | |
|---|---|---|
| ఏడాదికి | : | రూ. 110 |
| రెండేళ్ళకు | : | రూ. 200 |
| మూడేళ్ళకు | : | రూ. 280 |

| ప్రకటన ఛార్జీలు | |
|---|---|
| మల్టీకలర్ ఫస్ట్ పేజి (సగం)/బ్యాక్ పేజి(పూర్తి) | : రూ. 25,000 |
| మల్టీకలర్ ఇన్‌సైడ్ కవర్ పేజి (పూర్తి) | : రూ. 15,000 |
| బ్లాక్ అండ్ వైట్ లోపలి పేజి (పూర్తి) | : రూ. 10,000 |

**చందాలు లేదా ప్రకటనలకోసం పంపే డిడిలను 'ఏపిమాస్ -హైదరాబాద్' పేరుమీద పంపాలి**

మహిళా సాధికారత, ఏపిమాస్ కార్యాలయం, ప్లాట్ నెం.11-12, హుడా కాలని, తానీషా నగర్,
డ్రీమ్‌వ్యాలీ దగ్గర, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089. ఫోన్ : 08413-403118
Web: www.apmas.org, E Mail: info@apmas.org


నీ మిత్రుల భావోద్రేకాలతో ఆడుకోకు, ఆట గెలుస్తావేమో కాని శాశ్వతంగా వారికి దూరమవుతావు

# ఎస్ హెచ్ జి సమాఖ్యల మహా సమ్మేళనం!

## ఏపిమాస్, నాబార్డ్ సంయుక్త భాగస్వామ్యంలో రెండు రోజులపాటు జాతీయ కార్యశాల నిర్వహణ

మన దేశంలో ఎస్ హెచ్ జి సమాఖ్యలు ఎదుర్కొంటున్న సమస్యలను, సవాళ్ళను, అనుభవాలను, అవకాశాలను, అవసరాలను, అంచనాలను ప్రత్యక్షంగా ఆ సమాఖ్యల ప్రతినిధుల ద్వారానే తెలుసుకుని, సంబంధిత వివిధ అంశాలపై వారు పరస్పరం అవగాహన పొందేలా వారందరినీ ఒకే వేదికమీదకు తీసుకునివచ్చి, ఎస్ హెచ్ జి సమాఖ్యల ప్రతినిధులతో పాటు స్వయంసహాయ వ్యవస్థ సహభాగస్వాములందరితో కలసి 2030 నాటికి ఎస్‌హెచ్‌జి సమాఖ్యల సుస్థిరాభివృద్ధికి విజన్–2030 రూపొందించడం ప్రధాన ఆశయాలుగా నాబార్డ్‌తో కలసి ఏపిమాస్ హైదరాబాదులో ఈ నవంబర్ 29, 30 తేదీలలో రెండు రోజులపాటు ఎస్‌హెచ్‌జి సమాఖ్యల జాతీయ కార్యశాల'ను ఘనంగా నిర్వహించింది.

17 రాష్ట్రాలనుంచి 150 మందికి పైగా ఎస్ హెచ్ జి మహిళా సమాఖ్యల ప్రతినిధులు ఈ కార్యశాలలో పాల్గొనడం విశేషం.

దేశంలోని దాదాపు 110 లక్షల ఎస్ హెచ్ జిలు, 5 లక్షల సమాఖ్యల ద్వారా మహిళలు సాధించిన విజయోత్సవంగా, విభిన్న సంస్కృతీ సంప్రదాయాల మేళవింపుతో ఎట్టఎదుట నిలిచిన భారతదేశ లఘుదృశ్యంగా ఈ మహా సమ్మేళనం భాసించింది. ఆటు జాతీయ స్థాయిలో, ఇటు ప్రాంతీయ స్థాయిలో ఉత్తమ నిర్వహణ సాగిస్తున్న సమాఖ్యలను ఎంపిక చేసి పురస్కారాలను బహూకరించడం మరో విశేషం!

29 వ తేదీ కార్యశాల మొదటి రోజున హైదరాబాదులోని ఏపిమాస్ ప్రధానకార్యాలయంలోని ఎస్ హెచ్ జి అధ్యయన కేంద్రంలో, రెండవ రోజు 30వ తేదీన హైదరాబాద్‌లోని ఎం సి ఆర్ హెచ్ ఆర్ డి సంస్థ సమావేశ మందిరంలో ఈ కార్యశాలను నిర్వహించారు. రెండవ రోజున నాబార్డ్ ఛైర్మన్ డాక్టర్ జి ఆర్ చింతల ముఖ్య అతిధిగా హాజరయ్యారు. □

*స్వయంసహాయ సమాఖ్యలు బలపడాలంటే వాటికి తగిన శాసనపరమైన రక్షణ అవసరం. స్వయంసహాయ మహిళలు 'ఆత్మ నిర్భర్ మహిళలు'గా పరిణతి చెందాలి ... డాక్టర్ జి ఆర్ చింతల*



ఆర్థిక అక్షరాస్యత, ఆర్థిక సహభాగస్వామ్యం, గ్రామీణ వ్యాపార, పారిశ్రామిక సంస్థల స్థాపన వంటి జాతీయ ప్రాధాన్యాంశాల అమలులో ఎస్ హెచ్ జి సమాఖ్యలు అందించగలిగే సహాయ సహకారాలను గురించి ప్రణాళిక రూపొందించడం కూడా ఈ కార్యశాల నిర్వహణలో ఒక ప్రధాన అంశం.



**అనుభవాల కలబోత ...**

తొలి రోజు కార్యశాల జ్యోతి ప్రజ్వలనానంతరం వివిధ భాషలకు చెందిన ఎస్ హెచ్ జి మహిళల ఉత్సాహభరిత గానాలాపనతో శ్రవణానందకరంగా మొదలైంది. అనంతరం సమాఖ్యల ప్రతినిధులు సమాఖ్యల నిర్వహణలో తమ అనుభవాలను వివరించారు.

ఏపిమాస్ సి ఇ ఓ, మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ సి ఎస్ రెడ్డి మాఖ్యల ప్రతినిధులను ఉద్దేశించి ప్రసంగిస్తూ, ఏళ్ళ తరబడి అంకితభావంతో సమాఖ్యల ఎదుగుదలకు కృషి చేస్తున్నందుకు

ప్రపంచానికి అసలు సమస్య హింసోన్మాదులతో కాదు, సాధు స్వభావం పేరుతో నోరు మెదపకుండా చూసేవారితో



వారిని అభినందించారు. వారి గొంతులను వినాలని, వారి ఆశలను,ఆశయాలను, కలలను, గమ్యాలను, 2030 విజన్ ఎలా వుండాలన్న వారి అంచనాలను తెలుసుకోవడంకోసమే ఈ కార్యశాలను నిర్వహిస్తున్నట్టు శ్రీ సి ఎస్ రెడ్డి వారికి తెలిపారు.

అభివృద్ధి పథంలో పయనిస్తున్న ఈ సమాఖ్యలు ఆరోగ్యం, పారిశుధ్యం, విద్య వంటి అన్ని అంశాలపట్ల శ్రద్ధ వహించి సమగ్రాభివృద్ధి సాధనకు కృషిచేయాలని ఆయన పేర్కొన్నారు. విజన్ రూపకల్పన అంటే భవిష్యత్తులో మన సమాఖ్యలు ఎలా వుండాలో మనంచేసే ఆలోచనే అని, ఈ రెండు రోజులపాటు అందరం కలగలిసి మన సమాఖ్యల బంగారు భవిష్యత్తుకు బాటలు వేద్దామని శ్రీ సి ఎస్ వివరించారు.

ఫెసిలిటేటర్ కల్పనాపంత్ గారు మాట్లాడుతూ, కోవిడ్ బాధితుల ను ఆదుకోవడానికి ఆటు ప్రభుత్వాలు కాని, ఇతరులు కాని ముందుకురాకపోతే, ఎస్ హెచ్‌జి సభ్యులు మాత్రమే ముందునిలచి వారికి సహాయ సహకారాలను అందించారని చెప్పారు.

ఎన్ ఆర్ ఎల్ ఎం ప్రతినిధి ఉషారాణి గారు ఎస్‌హెచ్‌జి సమాఖ్యల సుస్థిరాభివృద్ధిని తాము కోరుకుంటున్నట్టు చెప్పారు. రుణాలు లభ్యం కావడంలో ఎందుకు జాప్యం జరుగుతున్నదని ఆమె ప్రశ్నించారు.

**ప్రతినిధుల అనుభవాల,అభిప్రాయాల సారం ...**

- ⇨ బోర్డు సభ్యులు, పదాధికారులు, సిబ్బంది ఎవరైనా సరే సభ్యులకు చదువు ఎంతో ముఖ్యం
- ⇨ సమాఖ్యలో నిర్ణయాలు తీసుకోవడం క్రమ పద్ధతిలో సాగాలి
- ⇨ బ్యాంకులనుంచి రుణాలు తీసుకుంటే తిరిగి చెల్లించే బాధ్యత గ్రూపు మొత్తం వహించాలి.
- ⇨ ఆర్థిక వ్యవహారాలు, మార్కెటింగ్, పరిశ్రమల నిర్వహణపై శిక్షణ అవసరం
- ⇨ పాడి పరిశ్రమ నిర్వహణలో రాజస్థాన్ సమాఖ్య అనుభవాలు ఎంతో స్ఫూర్తిదాయకం
- ⇨ ఎస్ హెచ్ జి సంస్థల బలోపేతానికి ప్రభుత్వాలు తగిన చట్టాలను రూపొందించాలి

**కార్యశాల రెండవ రోజు ...**

కార్యశాల రెండవ రోజున సన్నివేశం హైదరాబాద్ జూబ్లీహిల్స్ లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ (ఎం సి ఆర్ హెచ్ ఆర్ డి ఐ) ప్రధాన సమావేశ మందిరానికి మారింది. ఉదయం జ్యోతి ప్రజ్వలన, నాదు

చిల్లర నాణాలు శబ్దం చేస్తాయి, విలువైన నోట్లు నిశ్శబ్దంగా వుంటాయి; ప్రశాంతంగా వుండు, నీ విలువ పెంచుకో




నిర్దేశించుకున్న కార్యక్రమాల గురించి శ్రీ సి ఎస్ రెడ్డి ప్రసంగం అనంతరం రెండు ప్లీనరీలు జరిగాయి. మొదట 'భారతదేశంలో స్వయంసహాయ ఉద్యమ ప్రస్తుత స్థితి ... ఆర్థిక సహ భాగస్వామ్యం, వ్యాపార సంస్థలను ప్రోత్సహించడంలో సమాఖ్యల పాత్ర' అనే అంశంపైన, '2030 నాటికి ఎస్ హెచ్ జి సమాఖ్యల విజన్ రూపకల్పన' అనే అంశంపైన జరిగిన ఈ ప్లీనరీలలో సమాఖ్యల ప్రతినిధులు, ఇతర భాగస్వాములు విస్తృతంగా చర్చించారు.

భోజన విరామానంతరం జరిగిన 'ఉత్తమ ఎస్ హెచ్ జి సమాఖ్యలకు అవార్డుల బహూకరణ సభ' కు ముఖ్య అతిధిగా నాబార్డ్ ఛైర్మన్ డాక్టర్ జి ఆర్ చింతల పాల్గొన్నారు.

**అవార్డుల బహూకరణ**

జాతీయ స్థాయిలో, ప్రాంతీయ స్థాయిలో ఉత్తమ నిర్వహణ కనబరచిన స్వయంసహాయ సమాఖ్యలకు నాబార్డ్ ఛైర్మన్ డాక్టర్ జి ఆర్ చింతల, వేదికపై ఆసీనులైన ఇతర ప్రముఖుల చేతుల మీదుగా మెమొంటోలను, సర్టిఫికేట్లను, బహుమతి నగదును ప్రదానం చేశారు.

జాతీయ స్థాయిలో ఉత్తమ నిర్వహణ కనబరచిన ప్రథమ, ద్వితీయ, తృతీయ సమాఖ్యలకు వరుసగా లక్ష రూపాయలు, 75 వేల రూపాయలు, 25 వేల రూపాయలు, ప్రాంతీయ స్థాయిలో ఉత్తమ నిర్వహణ కనబరచిన ప్రథమ, ద్వితీయ, తృతీయ సమాఖ్యలకు వరుసగా 40 వేలు, 20 వేలు, 10 వేల రూపాయల నగదు బహుమతులు అందజేశారు.

**అగ్రగామి మహారాష్ట్ర ... రాజస్థాన్ అధికం ...**

జాతీయ స్థాయిలో అత్యుత్తమ నిర్వహణ కలిగిన సమాఖ్యగా మహారాష్ట్రకు చెందిన 'క్రాంతి జ్యోతి లోక్ సంచలిత్ సాధన కేంద్ర్' మొదటి బహుమతిని పొందింది. ఇంతే కాకుండా పశ్చిమభారత ప్రాంతీయ స్థాయిలో మొత్తం మూడు బహుమతులను మహారాష్ట్ర సమాఖ్యలు కైవసం చేసుకున్నాయి. అయితే జాతీయ స్థాయిలో ద్వితీయ బహుమతి, రెండు తృతీయ బహుమతులతో పాటు, ఉత్తరభారత ప్రాంతీయ స్థాయిలో ప్రథమ, తృతీయ బహుమతులను కైవసం చేసుకుని రాజస్థాన్ అత్యధికంగా మొత్తం ఐదు బహుమతులను పొందింది.

దక్షిణ భారత ప్రాంతీయ స్థాయిలోని మొత్తం మూడు బహుమతులను కేరళ సమాఖ్యలు చేజిక్కించుకోగా, ఉత్తర భారత ప్రాంతీయ స్థాయిలో ద్వితీయ బహుమతిని ఉత్తర ప్రదేశ్‌కు చెందిన సమాఖ్య గెలుచుకున్నది.

**సమాఖ్యలకు చట్టపరమైన మద్దతు కావాలి: డాక్టర్ చింతల**

పురస్కారాల ప్రదానానంతరం ముఖ్య అతిధి , నాబార్డ్ ఛైర్మన్ డాక్టర్ జి ఆర్ చింతల ప్రసంగిస్తూ, 30 సంవత్సరాల క్రితమే మనదేశంలో స్వయంసహాయ సంఘాల (ఎస్ హెచ్ జి ల) ఏర్పాటు కోసం మైరాడ సంస్థతో కలసి నాబార్డ్



ఆకాంక్షించారు.

ప్రస్తుతం ప్రతి స్వయంసహాయ మహిళ కేవలం 20 వేల రూపాయల తలసరి అప్పు పొందే అవకాశం మాత్రమే వున్నది. ఈ పరిమితిని లక్ష రూపాయలకు పెంచుకోవాలంటే సమాఖ్యలు సహకార చట్టంకిందనో, కంపెనీల చట్టం కిందనో నమోదుకావలసి వుందని, లేదా ఆ అవసరంలేకుండా ప్రత్యేకమైన చట్టంకోసం ఉద్యమించాలని డాక్టర్ చింతల సూచించారు. ఇంతేకాకుండా రైతు మహిళలు ఎఫ్ పి ఓలను ఏర్పాటుచేసుకుని వ్యవసాయ రంగంలో తమ భాగస్వామ్యాన్ని సుస్థిరం చేసుకోవాలని, మహిళలు వ్యాపారవేత్తలుగా, పారిశ్రామికవేత్తలుగా కూడా ఎదగాలని డాక్టర్ చింతల అభిప్రాయపడ్డారు. సమాఖ్యల నాయకులు, సభ్యుల మధ్య సదవగాహన వుండాలని తామూ సభ్యులతో సమానమనే భావంతో నాయకురాళ్ళు వ్యవహరించాలని ఆయన కోరారు.

ప్రయోగాత్మక పథకాన్ని (పైలట్ ప్రాజెక్ట్) చేపట్టిన విషయాన్ని గుర్తుచేశారు. మొదటిసారిగా 1992 లో స్వయంసహాయ మహిళలకు బ్యాంకులు రుణాలు అందించాయని, ఆ రుణాలను ఆ స్వయంసహాయ మహిళలు నూటికి నూరుశాతం తిరిగి చెల్లించారని ఆయన కొనియాడారు.

ప్రస్తుతం మన దేశంలో కోటికిపైగా స్వయంసహాయ సంఘాలు, ఐదు లక్షలకు పైగా వాటి సమాఖ్యలు వున్నా ఈ సమాఖ్యలు తగినంతగా బలపడలేదని, ఇందుకు కారణం వాటికి కావలసిన చట్టపరమైన అవకాశాలు లేకపోవడమేనని డాక్టర్ చింతల అన్నారు. ఈ లోటును పూరించడానికి తగిన చట్టాలు రావలసి వుందని, ఈ చట్టాల సాధనకోసం స్వయంసహాయ మహిళలు ఉద్యమస్ఫూర్తితో కృషిచేయాలని ఆయన పేర్కొన్నారు.

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఆత్మ నిర్భర్ భారత్' లో ఆత్మ నిర్భర్ మహిళలుగా స్వయంసహాయ మహిళలు భాగస్వాములు కావాలని, అప్పుడే మహిళల స్థితిగతులు మెరుగుపడి, మహిళా సాధికారత సాధ్యమవుతుందని ఆయన అన్నారు.

ఈ కార్యశాలలో స్వయంసహాయ మహిళా సమాఖ్యలకు 2030 నాటి అభ్యున్నతిపై విజన్ రూపొందిస్తున్న విషయాన్ని ఆయన పరోక్షంగా ప్రస్తావిస్తూ, 2030 నాటికి దేశంలో 45 కోట్ల మహిళలు స్వయంసహాయ సంఘాలలో చేరాలని, సుపరిపాలనతో, నియమనిబంధనలతో, చట్టపరమైన రక్షణలు కలిగి సుస్థిరాభివృద్ధి సాధిస్తున్న సమాఖ్యలు వుండాలని ఆయన

కార్యశాలలో చివరగా ఏపిమాస్ సి ఇ ఓ , ఎం డి శ్రీ సి ఎస్ రెడ్డి ప్రసంగిస్తూ, ప్రస్తుతం 9 రాష్ట్రాలలో స్వయంసహాయ సమాఖ్యలకోసం సహకార చట్టాలు వున్నాయని, ఆ రాష్ట్రాలలోని సమాఖ్యల నిర్వహణ తీరును పరిశీలించి, అర్హమైన సమాఖ్యలకు నేరుగా రుణాలు అందించడానికి నాబార్డ్ ముందుకువస్తే , మిగతా రాష్ట్రాలలో కూడా అటువంటి చట్టాలకోసం ఒత్తిడి వస్తుందని, కొత్తగా ఏర్పడే సమాఖ్యలకు ఉత్సాహభరితంగా, స్ఫూర్తిదాయకంగా వుంటుందని అన్నారు. ఏపిమాస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీ మధుమూర్తి వందన సమర్పణతో రెండురోజుల జాతీయ కార్యశాల దిగ్విజయంగా ముగిసింది.

ఈ సభలో డాక్టర్ జి ఆర్ చింతల, శ్రీ సి ఎస్ రెడ్డి తోపాటు ఏపిమాస్ ఛైర్మన్ శ్రీ కె. మాధవరావు, నిర్డ్ విశ్రాంత డైరెక్టర్ శ్రీ డబ్ల్యు ఆర్ రెడ్డి, సేవా బ్యాంక్ ఎం డి శ్రీమతి జయశ్రీ వ్యాస్, చైతన్య సంస్థ వ్యవస్థాపకురాలు శ్రీమతి సుధా కొఠారి, నాబార్డ్ విశ్రాంత సి జి ఎం శ్రీ మోహనయ్య వేదికను అలంకరించారు. ■

నీ శక్తి సామర్థ్యాలను చిన్నబుచ్చేవారే నీ పురోగతికి కారకులు, వారి వల్లనే నీ సత్తా మెరుగవుతుంది

# అవార్డులు పొందిన సమాఖ్యల వివరాలు

| వ.స. | సమాఖ్య పేరు | రాష్ట్రం | నగదు (రూ.లలో) | ప్రోత్సాహక సంస్థ | జాతీయం/ప్రాంతీయం | ర్యాంక్ |
|---|---|---|---|---|---|---|
| 1. | క్రాంతిజ్యోతి లోక్ సంచాలిత్ సాధన్ కేంద్ర | మహారాష్ట్ర | 1,00,00 | మావిమ్ (యంఏవిఐయం) | జాతీయ స్థాయి | 1 |
| 2. | క్రాంతి మహిళా మంచ్ | రాజస్థాన్ | 75,000 | ఐబిటిఎడిఎ | జాతీయ స్థాయి | 2 |
| 3. 1. | సంఘర్ష్ మహిళా మంచ్ | రాజస్థాన్ | 25,000 | ఐబిటిఎడిఎ | జాతీయ స్థాయి | 3 |
| 3. 2. | సవేరా మహిళా మంచ్ | రాజస్థాన్ | 25,000 | ఐబిటిఎడిఎ | జాతీయ స్థాయి | 3 |
| 5. | మైత్రి మహిళా మండల్ సమితి డూని | రాజస్థాన్ | 40,000 | శ్రీజన్ | ఉత్తర ప్రాంతం | 1 |
| 6. | ప్రేరణ మహిళా సమితి | ఉత్తరప్రదేశ్ | 20,000 | శ్రామిక్ భార్తి | ఉత్తర ప్రాంతం | 2 |
| 7. | చేత్న మహిళా మంచ్ | రాజస్థాన్ | 10,000 | ఐబిటిఎడిఎ | ఉత్తర ప్రాంతం | 3 |
| 8. | గ్రామీణ్ మహిళా స్వయంసిద్ధ సంఘ్ | మహారాష్ట్ర | 40,000 | చైతన్య | పశ్చిమ ప్రాంతం | 1 |
| 9. | ఉత్కర్ష్ లోక్‌సంచాలిత్ సాధన్ కేంద్ర | మహారాష్ట్ర | 20,000 | మావిమ్ | పశ్చిమ ప్రాంతం | 2 |
| 10. | తేజస్విని లోక్‌సంచాలిత్ సాధన్ కేంద్ర మొహాది | మహారాష్ట్ర | 10,000 | మావిమ్ | పశ్చిమ ప్రాంతం | 3 |
| 11. | నారిపట్ట సిడిఎస్ గ్రామ పంచాయత్ | కేరళ | 40,000 | స్టేట్‌పావర్టీ ఎరాడికేషన్ మిషన్ | దక్షిణ ప్రాంతం | 1 |
| 12. | మంగళాపురం కుడుంబశ్రీ సి డి ఎస్ | కేరళ | 20,000 | ఎన్ ఆర్ ఎల్ ఎం | దక్షిణ ప్రాంతం | 2 |
| 13. | కుడుంబశ్రీ మనిక్కల్ గ్రామ పంచాయత్ | కేరళ | 10,000 | గవర్నమెంట్ | దక్షిణ ప్రాంతం | 3 |

స్నేహమే నీ బలహీనత అయితే, నిన్ను మించిన బలవంతుడు వేరొకడు వుండడు

# వ్యాపారాభివృద్ధితోనే రైతు సంస్థల మనుగడ

– ఎస్. ప్రహల్లాద

**భా**రతదేశ ఆర్థిక వ్యవస్థకు రైతులే పట్టు కొమ్మలు అనేది జగమెరిగిన సత్యం. ఒకవైపు ప్రభుత్వం, మరోవైపు స్వచ్ఛంద సంస్థలు రైతుల పురోగతికి అనేక అభివృద్ధి కార్యక్రమాలకు రూపకల్పన చేసి అమలు పరుస్తున్నాయి. అయినప్పటికి ఆశించిన ఫలితాలు రావడం లేదు. ఇందుకు కారణం కార్యక్రమాల రూపకల్పనలో రైతుల భాగస్వామ్యం లేకపోవడమే. అందువలన రైతుల అభివృద్ధికి కావలసిన



వివిధ కార్యక్రమాలకు వారే రూపకల్పన చేసి వారి ద్వారానే అమలు జరిగేలా చూడాలని అప్పుడే రైతుల అభివృద్ధి సాధ్యం అవుతుందని ప్రభుత్వాలు, ప్రోత్సాహక స్వచ్ఛంద సంస్థలు నమ్ముతున్నాయి. అందువలన కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు స్వచ్ఛంద సంస్థలు కూడా రైతు ఉత్పత్తిదారు సంస్థలకు ప్రాధాన్యత ఇస్తూ వాటిని ప్రోత్సహిస్తున్నాయి.

ప్రస్తుత అంచనా ప్రకారం ఇప్పటికే భారతదేశంలో దాదాపు 10వేల రైతు ఉత్పత్తిదారు సంస్థలు వున్నాయి. అదనంగా భారత ప్రభుత్వం మరో 10 వేల రైతు ఉత్పత్తి దారు సంస్థలను ప్రోత్సహించడానికి చర్యలు చేపట్టినది.

అనగా రైతులు అందరూ రైతు సంస్థలలో చేరి వారికి కావలసిన కార్యక్రమాలను వారే రూపొందించుకోవాలని, అందుకు కావలసిన ప్రోత్సాహం ప్రభుత్వం సమకూరుస్తుందని ప్రభుత్వ ఉద్దేశం.

**నిరుపయోగంగా నిలిచిపోతున్న అనేక సంస్థలు**

వివిధ ప్రభుత్వ పథకాలలో భాగంగా ఒకవైపు ప్రభుత్వ విభాగాలు, మరోవైపు స్వచ్ఛంద సంస్థలు రైతు ఉత్పత్తిదారు సంస్థలను ఏర్పాటు చేస్తున్నాయి. అయితే ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్ణీత గడువు పూర్తి అయినతర్వాత ప్రోత్సాహ సంస్థల సహకారం వుండని కారణంగా చాలా రైతు ఉత్పత్తిదారుల సంస్థలు నిలిచిపోతున్నవి. ప్రతి రైతు ఉత్పత్తిదారు సంస్థ ఒక ముఖ్య కార్యనిర్వహణ అధికారిని (సి.ఈ.ఓ) నియమించుకొని, తమ కార్యకలాపాలను కొనసాగిస్తుంది. అయితే నిర్ణీత కాల వ్యవధి (ఉదా ॥ 3 సంవత్సరాలు) వరకు రైతు ఉత్పత్తిదారు సంస్థల నిర్వహణ వ్యయాలను అనగా సిబ్బంది జీతం, కార్యాలయం అద్దె మొదలగు వ్యయాలను ప్రభుత్వం గ్రాంట్ల రూపంలో సమకూరుస్తుంది. కాల వ్యవధి అయిపోయిన తరువాత రైతు ఉత్పత్తిదారు సంస్థలే ఆ నిధులను సమకూర్చు కొని ఖర్చులను భరించలసి వుంటుంది.

అయితే నిధులను సమకూర్చుకోలేని స్థితిలో సంస్థలు వుంటే కొద్దిరోజుల పాటు సంస్థ మూలధనమును నెలవారీ ఖర్చులకు వినియోగించ వలసి వస్తుంది. అదే జరిగితే "కూర్చొని తింటే కొండలు కుడా తరిగి పోతాయన్న" చందంగా సంస్థ లోని మూలధనం తరిగిపోయి సంస్థలు పూర్తిగా ఆగిపోయి వాటా దారులు కుడా తమ మూల ధనాన్ని పోగొట్టు కోవలసి వస్తుంది. అందువలన సంస్థ ప్రారంభం నుండే ఈ విషయమై కార్యవర్గాన్ని చైతన్యపరచవలసి వుంది.

**తొలి నుండే ఏపిమాస్ ప్రేరణ**

చిన్న, సన్నకారు రైతుల అభివృద్దే ధ్యేయంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణా , బీహారు రాష్ట్రాలలో పని చేస్తున్న ఏపిమాస్ (మహిళా అభివృద్ధి సొసైటీ) రైతు ఉత్పత్తిదారుల సంస్థలను ఏర్పాటుచేసి ప్రారంభం నుండే వివిధ రకాల వ్యాపార కార్యక్రమాలను చేపట్టి వారి నిర్వహణ వ్యయాలతో



పాటు కొంత మిగులు సంపాదించే విధంగా రైతు సంస్థలను చైతన్యపరుస్తున్నది. ప్రోత్సాహక సంస్థల తోడ్పాటు అందుతున్న కాలంలోనే తోడ్పాటు ముగిసిన తరువాత చేపట్టవలసిన కార్యక్రమాలపై ముందు చూపుతో రైతు సంస్థలు మనుగడ సాగించాలి.

**వ్యాపారాభివృద్ధి ప్రణాళికలే మూల స్తంభాలు**

ప్రతి రైతు ఉత్పత్తిదారు సంస్థ కూడా తొలినుంచే రాబోయే 5 సంవత్సరాలకు వ్యాపార అభివృద్ధి ప్రణాళికలను తయారు చేసుకోవాలి. అందులో మొదటి 3 సంవత్సరాలకు ప్రోత్సాహక సంస్థ ఖర్చులను భరిస్తుంది. 4వ సంవత్సరం నుండి రైతు సంస్థలే ఖర్చులు భరించుకొనే విధంగా ముందునుండే జాగ్రత్తగా ముందుకు అడుగులు వేయాలి.

**చిత్తూరు జిల్లాలో రైతు ఉత్పత్తిదారు సంస్థలు**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, చిత్తూరు జిల్లాలో ఏపిమాస్ 23 రైతు ఉత్పత్తిదారు సంస్థలను ఏర్పాటు చేయాలని సంకల్పించి, ఇప్పటికే 14 రైతు ఉత్పత్తిదారు సంస్థల రిజిస్ట్రేషన్ పూర్తి చేసినది. మిగిలిన 9 సంస్థలను డిసెంబరు ఆఖరు నాటికి పూర్తి చేయాలని సంకల్పించింది. ఈ 14 రైతు ఉత్పత్తిదారు సంస్థలలో ఆరు సంస్థలు మూడు సంవత్సరాలు, మూడు సంస్థలు రెండు సంవత్సరాలు, మిగిలిన ఐదు సంస్థలు ఒక సంవత్సరం పూర్తి చేసుకొని పురోగమిస్తున్నాయి.

ప్రోత్సాహక సంస్థ అయిన ఏపిమాస్ తాము ఏర్పాటు చేసిన రైతు సంస్థలకు నిర్వహణ వ్యయాలను సమకూరుస్తూ, ఖర్చులను కొంచెం కొంచం తగ్గిస్తూ , రైతు సంస్థలు తమ కాళ్ళపై తాము నిలబడే విధంగా వివిధ రకాల సామర్థ్యం పెంపుదల కార్యక్రమాలు చేపడుతున్నది. తాము అందించే ఆర్థిక ప్రోత్సాహం ఆగిపోయిన తరువాత కూడా ఆ సంస్థలు సుస్థిరాభివృద్ధితో కొనసాగాలని ఏపిమాస్ భావిస్తున్నది. అందులో భాగంగా సంస్థల సుస్థిరతకు కొన్ని నిర్మాణాత్మక కార్యక్రమాలను చేపట్టినది. వాటిలో కొన్ని:

1. చట్ట బద్ధ కార్యక్రమాల నిర్వహణ: పుస్తక నిర్వహణ ఏర్పాటు, వివిధ రకాల లైసెన్సులు పొందడం
2. నిర్ణీత విద్య కలిగిన వ్యక్తిని సీఈఓగా నియమించి వారికి తగు శిక్షణలు యివ్వడం
3. ఎఫ్‌పిఓ పాలక వర్గ సభ్యులకు తగు శిక్షణలు యివ్వడం, క్షేత్ర సందర్శనలు ఏర్పాటు చేయడం
4. ప్రతి నెల ఎఫ్‌పిఓ పాలక వర్గ సమావేశం ఏర్పాటు చేయడం
5. ప్రతి ఎఫ్‌పిఓకు ఐదు సంవత్సరాల వ్యాపారాభివృద్ధి ప్రణాళికను తయారు చేయించుట. ప్రతి సంవత్సరం చేపట్టవలసిన కార్యక్రమాలను ముందే సిద్ధం చేసుకోవడం



6. ప్రతి నెల ఆదాయ వ్యయాలను పరిశీలించడం, తగు సూచనలు చేయడం
7. ప్రతి ఎఫ్‌పిఓ ఇన్‌పుట్ ఔట్‌పుట్ మార్కెటింగ్ కార్యక్రమాలు చేపట్టడం

పైన తెలిపిన కార్యక్రమాలను చేపట్టడం ద్వారా రైతు ఉత్పత్తిదారు సంస్థలు ప్రోత్సాహక సంస్థ తోడ్పాటు విరమించిన తరువాత కూడా సుస్థిరాభివృద్ధితో పురోగమిస్తాయని ఆశించవచ్చు. ■

# చిరుధాన్యాలకు అంతర్జాతీయ గుర్తింపు !

## 2023వ సంవత్సరాన్ని చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించనున్న ఐక్యరాజ్య సమితి

– గోపాల రాజు

**చి**రుధాన్యాల ఆహారం గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిచెప్పాలన్న భారతీయుల కృషి ఫలిస్తున్నది. ఎన్నో పోషక విలువలు కలిగి, తక్కువ పెట్టుబడితో, ఏ నేలలోనైనా బెట్టను తట్టుకుని పండే చిరుధాన్యాలను విస్తృతంగా పండిచాలి, వినియోగించాలి, ప్రపంచమంతా అవగాహన కల్పించాలి' అనే దృఢ సంకల్పంతో భారత ప్రభుత్వం ఐక్యరాజ్య సమితికి ఒక ప్రతిపాదనను పంపింది. ఐక్యరాజ్యసమితిలో అంతర్భాగమైన ఆహారం, వ్యవసాయ సంస్థ (ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్) వారు భారత ప్రభుత్వం చేసిన ప్రతిపాదనను ఆమోదించింది. ఈ విషయమై 2021 డిసెంబరు నెలలో జరగబోయే ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ సమావేశంలో '2023 సంవత్సరాన్ని అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం'గా జరుపుకోనున్నట్టు లాంఛనంగా ప్రకటించనున్నారు.





భారత ప్రభుత్వం ముందుగానే 2018 లోనే జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించి, చిరుధాన్యాలకు కనీస మద్దతు ధర ప్రకటించింది. మధుమేహవ్యాధి నివారణకు, పోషక విలువల పెంపుదలకు, ఆహారధాన్యాల కొరత నివారణకు కేంద్ర పౌర సరఫరాల శాఖ ద్వారా ప్రజా పంపిణీ వ్యవస్థలో చిరుధాన్యాలను సమ్మిళితం చేయాలని భారత ప్రభుత్వం ఆలోచిస్తున్నది.

దాదాపు 30 దేశాలలో 50 కోట్ల మంది ప్రజలు చిరుధాన్యాలలో ఒకటైన జొన్నను తమ ప్రధాన ఆహారంగా తీసుకునేవారు. రానురాను వరి, గోధుమ, మొక్కజొన్న, సోయాబీన్ వంటి హైబ్రిడ్ పంటలకు ఎక్కువగా అలవాటు పడడంతో గత 40 సంవత్సరాలలో చిరుధాన్యాల పంటలు పండించడం, వినియోగించడం బాగా తగ్గింది. ఆహార ధాన్యాల విషయంలో చోటు చేసుకున్న ఈ మార్పు చాలా అనర్థాలకు దారి తీస్తున్నది.

### నల్లమాడలో అవగాహన సదస్సు

ఈ సందర్భంగా సాధారణ ప్రజానీకానికి, రైతులకు చిరుధాన్యాల పంటల గూర్చి, వాటిలోని పోషకాల ప్రభావాన్ని గూర్చి అవగాహన కల్పించాలనే సంకల్పంతో ఏపిమాస్ సంస్థ నిర్వహణలోని 'క్లైమేట్ స్మార్ట్ విలేజ్ ప్రాజెక్ట్' ఆధ్వర్యంలో, నల్లమాడ మండల రైతు సమాఖ్య, అనంత ఆదరణ రైతు సంస్థలతో కలసి అనంతపురం జిల్లా నల్లమాడలోని ఆర్.డి.టి కార్యాలయ సమావేశ మందిరంలో 2021 నవంబర్ 14న చిరు ధాన్యాల పంటల పెంపుదల, పోషకాహారంపై అవగాహన సదస్సు నిర్వహించింది.

ప్రఖ్యాత స్వతంత్ర శాస్త్రవేత్త, చిరుధాన్యాల ప్రచారకర్త డాక్టర్ ఖాదర్‌వలీ ఈ సదస్సులో ముఖ్య అతిధిగా పాల్గొని చిరుధాన్యాలపై ఎంతో అవగాహన కలిగించారు. ఈ అవగాహన సదస్సులో నల్లమాడ మండలంతో పాటు, చుట్టుప్రక్కల మండలాలైన కదిరి, బుక్కపట్నం, లేపాక్షి, కొత్తచెరువు మండలాల నుండి దాదాపు 250మంది మహిళా సంఘ సభ్యులు, రైతులు, సాధారణ పౌరులు పాల్గొన్నారు. ఖాదర్ వలిగారు ప్రసంగిస్తూ, 'నేటి సమాజంలో ఆరోగ్యం,




ఆహారం, వ్యవసాయ విధానాలు ఎంతగానో మార్పు వచ్చింది, ఈ మార్పు కారణంగా మానవ జాతి ఆరోగ్యం, మేధస్సు, ఆయుస్సు, ఆనందం క్రమేణా క్షీణిస్తున్నది. ఏ ఇల్లు చుసినా రోగాలు లేని వారంటూ లేరు. ఏ డాక్టర్ దగ్గరకు వెళ్ళినా టానిక్‌లు, మాత్రాలు అంటూ 4 లేదా 5 రకాలు ఇచ్చి పంపుతున్నారు.

ప్రతి రోజు, ప్రతి పూట మనం తీసుకునే సహజమైన ఆహారం జీర్ణమై శరీరంలో చక్కెరగా తయారవుతుంది. కానీ





ఇప్పుడున్న సమాజంలో మానవులు తిన్న ఆహారం చక్కర రూపంలో వచ్చినా కూడా వివిధ రకాల టీలు, కాఫీ, బ్రూ అంటు చక్కెరలు వాడుతూ రోజుకు కొంతమంది కాఫీల పైనే ఆధారపడి వాటికి అలవాటు పడిపోతున్నారు.

ఈ అలవాటు వలనే మానవులు ఆరోగ్యం క్షీణించడంతో పాటు రకరకాల రోగాల బారిన పడుతున్నారు. కొంచెం పని చేస్తేనే ఎక్కువ అలసిపోతున్నారు. బుద్ధి మాంద్యంతో పుట్టే పిల్లలు సంఖ్య పెరిగింది. సంతానలేమి సమస్యలు ఎక్కువయ్యాయి. పాలు, టీ, కాఫీల వంటి జింకుతో కూడిన ఆహార పదార్థాల వల్ల హార్మోనుల లోపం పెరిగింది.

కావున ప్రతి ఒక్కరు చిరుధాన్యాలు అనగా కొర్రలు, సామలు, వరిగలు, ఆరికెలు, అండు కొర్రలు వంటి 5 రకాల ధాన్యాలు తింటే చాలా రోగాలు మన దరికి చేరకుండా చేసు కోవచ్చు. అండు కొర్రలలో 12.5% పీచు పదార్థం ఉంటుంది. చిరుధాన్యాలలో కెల్లా అండు కొర్రలలో పీచుపదార్థం ఎక్కువ. ప్రతి కుటుంబం ఇంటి ఆవరణలో లేదా పొలంలో ఈ 5 రకాల చిరుధాన్యాల పంటలు వేసుకుని వినియోగిస్తే ఆరోగ్యం వారి అదుపులో ఉన్నట్లే. ప్రస్తుత సమాజంలో కార్పొరేట్ వ్యవసాయం ఎక్కువగా వుంది.

కొత్త కొత్త రకాల వంగడాలు, అధిక దిగుబడి అని చెప్పి మోసం చేస్తూ, వాటికి అధిక మోతాదులో క్రిమి సంహారకాలు వాడే విధంగా చేసి ఒకపక్క విత్తన కంపెనీలు, క్రిమి సంహార కంపెనీలు, ఆరోగ్యం కోసం రకరకాల మందులు తయారు చేసే కంపెనీలు మన అవసరం చూసి నగదు పోగుచేసుకొని ధనవంతులుగా మారుతున్నారు.

రైతులు తమ వంతు చిరుధాన్యాల పంటలు పండివ్వాలి మరియు చిరుధాన్యాలనే తినే విధంగా అలవాటు చేసుకోవాలి. వరి పంటలు తగ్గించి చిరుధాన్యాలు, నవధాన్యాల పంటలను పూర్వకాల పద్ధతిలో లాగా


*(మిగిలినది 15వ పేజీలో....)*

# సూది పురుగు దాడి నుంచి టమాటాకు రక్షణ!


– జగన్మోహన్ రెడ్డి



2015 సంవత్సరంలో డాక్టర్ వై. యస్. ఆర్. ఉద్యాన విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు (తిరుపతిలోని చీని, నిమ్మ పరిశోధాన స్థానానికి చెందిన డా॥ డి. శ్రీనివాస రెడ్డి, డా॥ ఎల్. ముకుంద లక్ష్మి, డా॥ టి. రాజశేఖరం, డా॥ ఆర్. నాగరాజు, వెంకటరామన్నగూడెంకు చెందిన డా॥ ఆర్.వి.యస్.కె. రెడ్డి) చిత్తూరు జిల్లాలో సర్వేచేసే సమయంలో టమాటా సూది పురుగును (*టూటా అబ్సోల్యూట*) మొదటగా గమనించారు. తర్వాత ఈ పురుగు ఇతర జిల్లాలకు కూడా వ్యాపించింది. టమాటా పంట కాకుండా ఈ పురుగు బంగాళదుంప, వంగ, పొగాకు మొదలైన పంటలను, అలాగే సొలనేసి కుటుంబానికి చెందిన ఉమ్మెత్త, కామంచి వంటి కలుపు మొక్కలను ఆశిస్తుంది.




*ఆకులను నష్టపరచిన లార్వా ... టమాటా కాయ మీద సూది పురుగు రంధ్రాలు ... లింగాకర్షక బుట్టలు*



*గ్రుడ్లు ... లార్వా ... ప్యూపా ... రెక్కల పురుగు*

**జీవిత చక్రం:** పెద్ద పురుగులు మెరిసే గోధుమ రంగులో ఉంటాయి. తల్లి పురుగు ఆకులు, మొగ్గలు, కాండం, పచ్చి కాయల వృంతాల కింద 300 దాకా గ్రుడ్లు పెడతాయి. ఈ గ్రుడ్లు అండాకారంలో, లేత పసుపు రంగులో ఉండి 7 రోజుల పొదిగే కాలం కలిగి ఉంటాయి. తాజాగా పొదిగిన పిల్ల పురుగులు(లార్వా) లేత పసుపు నుంచి ఆకుపచ్చ రంగులో ఉంటాయి. పిల్ల పురుగులు అభివృద్ధి చెందుతున్న కొద్దీ ముదురు ఆకుపచ్చ రంగులోకి మారుతాయి.

ఈ పురుగు జీవిత చక్రంలో లార్వాలో నాలుగు దశలు (ఇన్‌స్టార్లు) ఉంటాయి. ఈ పిల్ల పురుగు (లార్వా) దశ 8 రోజుల్లో పూర్తవుతుంది. పరిపక్వ లార్వ ప్యూపాదశ కోసం మట్టిలోకి జారి, పట్టు గూడు లాంటి గూటిలో (సిల్కెన్ కకూన్) కోశస్థ (ప్యూపేషన్) దశకు చేరుతుంది. ఈ కోశస్థ దశ 10 రోజులు ఉంటుంది. గ్రుడ్డు నుండి రెక్కల పురుగు వరకు మొత్తం జీవిత కాలం 24–38 రోజుల్లో పూర్తి చేసుకుంటూ, ఒక సంవత్సరంలో 10–12 తరాలు ఉత్పత్తి చేస్తుంది. తల్లి రెక్కల పురుగులు 10–15 రోజులు జీవిస్తాయి

**నష్ట పరిచే విధానం**

- గ్రుడ్లు పొదిగిన తరువాత, చిన్న పిల్లపురుగులు ఆకుల లోనికి చొచ్చుకుపోయి, పత్రహరితం తింటూ

**నీవు గెలిస్తే నీ శ్రేయోభిలాషులకు నీవెవరో తెలుస్తుంది, ఓడితే నీ శ్రేయోభిలాషులెవరో నీకు తెలుస్తుంది**

పెరుగుతాయి కొన్నిసార్లు పువ్వులను, కాండాన్ని కూడా ఆశిస్తుంది.

- ఒకటి కంటే ఎక్కువ లార్వా ఉన్నట్లైతే మొత్తం ఆకులు ఎండిపోతాయి.
- పిల్ల పురుగులు పండ్లలోకి ప్రవేశించటం వలన చిన్న సూది లాంటి రంధ్రాలు ఏర్పడతాయి.
- పండ్ల మీద రంధ్రాలు ఏర్పడటం వలన శిలీంద్ర తెగులు కూడా ఆశిస్తుంది.

**యాజమాన్య పద్ధతులు**

- పంట కోసిన వెంటనే పొలాలను దున్నడం ద్వారా మట్టిలో ఉన్న కోశస్థదశను నాశనం చేయవచ్చు.
- కొత్త పంటను నాటడానికి కనీసం ఆరు వారాల ముందు పొలాన్ని దుక్కిచేసి ఉంచాలి.
- బెండ, బీన్స్, క్యాబేజ్, కాలీఫ్లవర్, ఆకుకూరలు మొదలైన కూరగాయ పంటలతో పంట మార్పిడి చేయాలి.
- ప్రధాన పొలంలో నారు నాటే ముందు ఒక ఎకరానికి వేప పిండి 200 కిలోలు వేసుకోవాలి.
- నర్సరీలో నైలాన్ నెట్ (200 మెష్ సైజు) క్రింద పెంచిన, ఆరోగ్య వంతమైన టమాట నారును ఎంచుకోవాలి.
- టమాట నారును ప్రధాన పొలంలో నాటే ముందు ఇమిడాక్లోప్రిడ్ 17.8 ఎస్.ఎల్. ఏ 0.3 మి. లీ. ఒక లీటరు చొప్పున కలిపిన మందు ద్రావణంలో నారును ముంచి నాటుకోవాలి.
- ఈ పురుగు ఉధృతి గమనించడంకోసం ఒక ఎకరానికి 4-5 వంతున లింగాకర్షక బుట్టలు అమర్చుకోవాలి.
- సూది పురుగు గ్రుడ్డు దశలో ట్రైకోగ్రామ్మ బదనికలను ఎకరానికి 18,000 చొప్పున వారంరోజుల వ్యవధిలో, 3-4 సార్లు విడుదల చేయాలి.
- మొదటగా సూది పురుగు గమనించిన వెంటనే వేపగింజల కషాయం 5% (5 కిలోల వేప గింజలు 100 లీటర్ల నీటిలో) లేదా అజాడిరక్టిన్ 10000 పి.పి.ఎమ్ ఒక లీటరు నీటికి 2-3 మి.లీ వంతున కలిపి పిచికారీ చేసుకోవాలి. ఆ తర్వాత కూడా పురుగు నష్టం కొనసాగితే ఇన్‌డాక్సాకార్బ్ 14.5 ఎస్.సి 0.8మి.లీ./లీ. లేదా క్లోరాంట్రనిలిప్రోల్ 18.5 ఎస్.సి 0.3మి.లీ./లీ. లేదా ఫ్లూబెండిమైడ్ 20 డబ్ల్యూ.జి. 0.2 గ్రా./లీ. లేదా స్పైనోసాడ్ 45 ఎస్.సి. 0.35 మి.లీ. / లీ. (75మి.లీ. / ఎకరానికి) లేదా సయాంట్రనిలిప్రోల్ 10 ఓ డి 0.3మి.లీ./లీ. (60 మి.లీ./ఎకరానికి) 15 రోజుల వ్యవధిలో మూడు సార్లు పిచికారీ చేసినట్లయితే పురుగును సమర్ధవంతంగా నివారించవచ్చు. ■

## చిరుధాన్యాలకు అంతర్జాతీయ గుర్తింపు !

*(13వ పేజీ తరువాయి....)*

పండించాలి. కరోనా మహమ్మారిని తరిమి కొట్టాలంటే ముందు మన శరీరంలో శక్తి ఎక్కువ వుండాలి ఎటువంటి వైరస్‌నైనా తరిమికొట్టే శక్తి వున్నప్పుడు మాత్రమే మన శరీరం వైరస్‌ను మన జోలికి రాకుండా నియంత్రిస్తుంది. ఇందుకోసం ప్రతి రోజు కాఫీ, టీల బదులు అంబలి తాగడం, ఉదయం ఎండలో కూర్చోవడం, చిరుధాన్యాలు తినడం అలవాటు చేసుకోవాలి' అని తెలియజేశారు.

ఈ సదస్సులో శ్రీ ఖాదర్ వలిగారితో పాటు హైదరాబాదు లోని ఎన్ ఐ ఆర్ డి రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్. గంగిరెడ్డి, 'ఎర్త్ 360 ఎకోవెంచర్ ' ప్రతినిధి శ్రీ దినేష్, వెలుగు ఏపియం శ్రీ భాస్కర్ రెడ్డి, ఏపిమాస్ సిబ్బంది, ఎఫ్ పి ఓ సిబ్బంది, బి ఓ డి సభ్యులు, ఎస్ హెచ్ జి సభ్యులు, రైతు సంఘం సభ్యులు, రైతులు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు. అవగాహన సదస్సుకు విచ్చేసిన 250 మందికి చిరుధాన్యాలతో తయారుచేసిన ఆహారాన్ని మధ్యాహ్న భోజనంగా ఏర్పాటుచేశారు. కురబలకోట మహిళా సంఘం వారు చిరుధాన్యాల తినుబండారాలను ప్రదర్శించారు. విజయవాడ నుండి వివిధ పబ్లికేషన్స్ వారు పుస్తక ప్రదర్శన, అమ్మకాలు నిర్వహించారు. ■

# గ్రామాలలో వినూత్న వ్యాపారాభివృద్ధికి తోడ్పాటు !

– కరుణాకరణ్ రెడ్డి

**భా**రతదేశంలో, 68.84% కంటే ఎక్కువ జనాభా గ్రామీణ ప్రాంతాలలో నివసిస్తున్నారు. గ్రామీణ ప్రజలకు వ్యవసాయం ప్రధాన ఆదాయ వనరులలో ఒకటి. పేద కుటుంబాలకు పేదరికం నుండి బయటపడేందుకు మూడు, నాలుగు రకాల ఆదాయ వనరులు అవసరం. వీటిలో ముఖ్యమైన ఆదాయ వనరులు, వ్యవసాయేతర జీవనోపాధులు, నైపుణ్యం ఆధారిత పనులు, చిన్న వ్యాపార సంస్థలు, మార్కెట్‌పై అవగాహన, అకౌంటింగ్, ఆర్థిక మద్దతు, వ్యాపార నైపుణ్యాలు తగినంతగా లేకపోవడంవల్ల ఈ సంస్థలు తరచుగా విఫలమవుతున్నాయి.



ఈ సమస్యలను పరిష్కరించడానికి, కేంద్ర ప్రభుత్వం 'స్టార్ట్–అప్ విలేజ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ప్రోగ్రామ్' ను (ఎస్ వి ఇ పి) ను ప్రారంభించింది. భారత ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖకు చెందిన జాతీయ గ్రామీణ జీవనోపాధుల సంస్థ (ఎన్ ఆర్ ఎల్ ఎం) ఆధ్వర్యంలో తెలంగాణ సెర్ప్, మహిళా అభివృద్ధి సంస్థ (మాస్) సంయుక్త భాగస్వామ్యంలో స్టార్టప్ విలేజ్ ఎంట్రప్రెన్యూర్ ప్రోగ్రాంను, సంగారెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలలోని నారాయణఖేడ్, చంద్రుగొండ మండలాలలో నిర్వహిస్తున్నారు.

ఎస్ వి ఇ పి ముఖ్య లక్ష్యం "గ్రామాల్లో పేదరికాన్ని, నిరుద్యోగాన్ని తగ్గించడం. ఇందుకోసం ఆర్థికవృద్ధిని ప్రోత్సహించడం, గ్రామీణ పరిశ్రమలను నెలకొల్పడంలో మద్దతు, వ్యాపార నైపుణ్యాలను కల్పించడం ముఖ్యాంశాలు. ఈ అంశాలపై ఈ మండలాలలో మాస్ క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి, ఆ సర్వే నివేదికను (డి పి ఆర్) తెలంగాణ సెర్ప్‌కు సమర్పించగా తెలంగాణ సెర్ప్, జాతీయ గ్రామీణ జీవనోపాదుల సంస్థ సంయుక్త సమీక్షా సమావేశం నిర్వహించి, క్షేత్ర స్థాయిలో ఎస్ వి ఇ పి నిర్వహించడానికి మాస్‌కు 2019 డిసెంబరులో అనుమతి యిచ్చింది.

ఈ కార్యక్రమం క్షేత్ర స్థాయిలో అమలు పరచడం కోసం, బ్లాక్ రిసోర్స్ సెంటర్ ఫర్ ఎంటర్‌ప్రైజ్ ప్రమోషన్ (బి ఆర్ సి – ఇ పి) కేంద్రంగా, గ్రామ స్థాయి కమ్యూనిటీ కేడర్ (సిఆర్‌పి–ఇపి) ఏర్పరచుకుని, వివిధ రకాల వ్యాపారాభివృద్ధికి సంబంధించిన వివిధ అంశాలపై మాస్ శిక్షణ యిప్పించి వారిని చిన్న పారిశ్రామిక, వ్యాపార వేత్తలుగా తీర్చిదిద్దుతున్నది.

పొదుపు సంఘాలు, సమాఖ్యల సమావేశాలలో పాల్గొంటూ, తమ పరిధిలోని గ్రామాల్లో వ్యాపారంపై ఆసక్తి, అర్హత ఉన్న వారిని ఎంపిక చేసి వారికి తగు సలహాలను, సూచనలను అందిస్తూ, వ్యాపార ప్రణాళికలను రూపొందించుకోవడంలో, రుణాలను పొంది వ్యాపారాన్ని ఏర్పాటు చేసుకోవడంలో సి ఆర్ పి – ఇ పి లు వారికి దోహదపడతారు. వీరు ప్రతి నెల వ్యాపారస్తుల వద్దకు వెళ్ళి, వారి వ్యాపార నిర్వహణ సమాచారాన్ని తెలుసుకుని, వ్యాపారాభివృద్ధికి వారికి తగినలను సూచనలు చేస్తారు.

ఈ పథకం కింద ప్రతి వ్యాపార ప్రారంభానికి పొదుపు సంఘాలకు ఆర్థిక తోడ్పాటు అందించే బ్యాంకు లింకేజీ,

**ఇతరుల నిబంధనలను నీవు హేళన చేస్తావు సరే , కానీ నీ నిబంధనలూ అలాంటివేనేమో చూడు**



స్త్రీనిధి రుణాలతోపాటు ఎస్ వి ఇ పి – కమ్యూనిటీ ఎంటర్‌ప్రైజ్ ఫండ్ (సి ఆర్ ఎఫ్) ద్వారా 9591 రూపాయలు రుణంగా సమకూర్చుతారు.

**నారాయణఖేడ్, చంద్రుగొండ బ్లాక్‌లలో ప్రగతి**

ఇప్పటివరకు నారాయణఖేడ్, చంద్రుగొండ రెండు బ్లాకులలో సి ఆర్ పి – ఇ పి ల శిక్షణ పూర్తి చేసుకొని, నారాయణఖేడ్ బ్లాక్‌లో సుమారుగా 575 వ్యాపారాలను, చంద్రుగొండ బ్లాక్ పరిధిలో 325 వ్యాపారాలను ఏర్పాటు



చేసుకున్నారు. వీటిలో ఎక్కువ శాతం మహిళలు నిర్వహించే వివిధ రకాలయిన వ్యాపారాలను ప్రారంభించుకున్నారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా తాము వ్యాపారవేత్తలుగా ఎదగాలి అనుకొనే మహిళలకు ఎంతో ప్రోత్సాహం, చేయూత అందించడం జరుగుతుంది. నూతనత్వంతో కూడిన ఆలోచనలు ఉన్నవారికి వ్యాపారం ప్రారంభించడానికి తగు జాగ్రత్తలు సూచిస్తూ , అవసరమైన శిక్షణ యిస్తూ వ్యాపారాన్ని ప్రారంభింపజేయడం ఈ పథకం ప్రత్యేకత.

ఈ ప్రాజెక్ట్ ద్వారా పొదుపు సంఘాల సభ్యురాళ్ళకు సగటున రూ. 50,000 నుండి 60,000 వరకు రుణాలు సమకూర్చారు.

**ఎదురయ్యే సవాళ్ళు**

1. ఎస్ హెచ్ జి మహిళల జీవనోపాధిని ప్రోత్సహించడానికి బి ఆర్ సి సభ్యులకు శిక్షణ ఇచ్చి వారి సామర్థ్యాన్ని పెంచడం ద్వారా స్వయం ఆధారితంగా సుస్థిరాభివృద్ధికి కృషి చేసే విధంగా సంస్థను తీర్చిదిద్దవలసి వుంటుంది.
2. సి ఆర్ పి – ఇ పి, బి ఆర్ సి సభ్యుల సామర్థ్యాలను ప్రోత్సహించాలి.
3. కిరాణా వంటి పాత వ్యాపారాల కంటే వినూత్నమైన సంస్థలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది.

**తదుపరి కార్యాచరణ**

1. వినూత్నమైన వ్యాపారాలను గుర్తించడం, ప్రోత్సహించడం.
2. వ్యవస్థాపకులకు సరైన మద్దతును అందించడం.
3. బి ఆర్ సి ని జీవనోపాధిని ప్రోత్సహించే సంస్థగా బలోపేతం చేయడం.

రాబోయే కాలంలో మరిన్ని కొత్త వ్యాపారాలను చేపట్టేలా చేసి, ఈ ప్రాజెక్ట్ ఇకముందు కూడా ఎంతోమంది నిరుపేదల జీవితాల్లో వెలుగును నింపడానికి ముమ్మరంగా కృషి జరుగుతున్నది. ■



నీవు ఏ దృష్టితో చూస్తే అదే రకంగా ప్రపంచం నీకు కనిపిస్తుంది, దృష్టి కోణం మార్చి చూడు అంతా అద్భుతమే!

# సోలార్ హైడ్రో ఫోనిక్స్ ద్వారా గడ్డి పెంపకం!

*- తప్పెట రమేష్ రెడ్డి*

**చి**త్తూరు జిల్లా రామసముద్రం మండలం కే.సి.పల్లి పంచాయతీ యంబడి గ్రామంలో నివసిస్తున్న శ్రీ కె. రెడ్డప్ప రెడ్డికి జి ఐ జడ్ , ఏపిమాస్ సహకారంతో సెల్కో ఫౌండేషన్ ద్వారా ప్రయోగాత్మక వినియోగం (డెమో) కోసం 'హైడ్రోఫోనిక్ యూనిట్'ను ఏపిమాస్ ఆధ్వర్యంలోని రామసముద్రం ఎఫ్ పి ఓ సమకూర్చింది. రెడ్డప్ప రెడ్డికి రెండు ఆవులు, ఒక దూడ వున్నాయి.





మే నెలలో ఇతని ఇంటి దగ్గరనే ఈ సోలార్ హైడ్రో ఫోనిక్స్ ప్లాంట్ ను పెట్టడం జరిగింది. దీన్ని ఏవిధంగా వాడాలి, ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి , దీనివల్ల ఉపయోగాలేమిటి అనే విషయాలపై ఏపిమాస్ శిక్షణ కూడా యిచ్చింది. ఇంతేకాకుండా చిత్రదుర్గ సేల్కో ఫౌండేషన్ యూనిట్‌కు తీసుకువెళ్ళి హైడ్రో ఫోనిక్స్ ప్లాంట్ పనితీరును స్వయంగా గమనించేలా చేసి, మెలకువలు కూడా నేర్పించడం జరిగింది.

రెడ్డప్ప రెడ్డి మే 15వ తేది నుండి ఈ యూనిట్ ను పూర్తిగా వినియోగిస్తూ , ఆవులకు పోషకాలతో, ప్రోటీన్స్‌తో కూడిన మొలిచిన 5 రోజుల మొక్కజొన్న గడ్డిని పెడుతున్నాడు.

**హైడ్రో ఫోనిక్స్ యూనిట్ పనితీరు**

- ఇందులో 24 ట్రేలలో ఒకేసారి మొక్కజొన్న విత్తనాలను వేసి లేతగడ్డిని పొందవచ్చు.
- ప్రతి ట్రే లో 0.75 నుండి 1కేజీ వరకు విత్తనాలను ఉంచవచ్చు.
- ప్రతి నెలలో సరాసరి మన అవసరాన్నిబట్టి 4 నుండి 5 సార్లు లేతగడ్డిని తీయవచ్చు.
- ఇది సోలార్ సహాయంతో నడుస్తుంది కాబట్టి విద్యుత్ ఖర్చు ఉండదు.
- పైగా ఇది ఆటోమేటిక్ మెషిన్ ప్రతి 2 గంటలకు ఒకసారి తేమను విత్తనాలకు అందిస్తుంది. మనం ప్రతి సారి దీనికోసం సమయం కేటాయించవలసిన అవసరం లేదు.

**ఉపయోగించే విధానం**

- మొదటగా మొక్క జొన్న విత్తనాలను సేకరించి, బాగా శుభ్రం చేసి ఒకరోజంతా నీటిలో నానబెట్టాలి.
- ఆ తరువాతి ఉదయం ఒక బట్ట సహాయంతో మూట కట్టి మొలకలు వచ్చేంతవరకు ఉంచాలి. ఈ మొలకలు ఎంతసేపట్లో వస్తాయనేది వాతావరణ పరిస్థితిని బట్టి ఉంటుంది.
- ఆ తరువాత ఫోనిక్స్ ప్లాంట్‌లోని పైపులను బాగా శుభ్రపరచాలి. ఎందుకంటే కొన్నిసార్లు నాజిల్స్ రంధ్రాలు లవణాల కారణంగా మూసుకొని ఉండి పోతాయి. ఆ కారణంగా నీటి ప్రవాహం ఆగిపోవచ్చు.

మేలు చేసిన వారిని మరువకు, ప్రేమించే వారిని ద్వేషించకు, నమ్మిన వారిని వంచించకు

- ⇨ ట్రేలను కూడా శుభ్రంగా తుడిచి తేమ లేకుండా చూడాలి. ముఖ్యంగా ట్రేలను ఏటవాలుగా ఉంచి, తేమ లేకుండా చూడాలి.
- ⇨ మొలకెత్తిన విత్తనాలను ట్రేలలో పలుచగా పరచాలి. యూనిట్‌లోకి పక్షులు పోకుండా యూనిట్‌కు ఉన్న ఎగ్జిట్ కవర్‌తో కప్పాలి.
- ⇨ అనంతరం మెయిన్ వాటర్ పైప్‌కు కలిపి మోటార్ ఆన్ చేసి ఉంచితే ప్రతి 2 గంటలకు ఒకసారి తేమని, విత్తనాలకు అందిస్తుంది. ఈ సమయాన్ని మన సమయాన్నిబట్టి మార్చుకోవడానికి వీలు ఉంటుంది.
- ⇨ తర్వాత 5 నుండి 6 రోజుల లోపల మొక్కజొన్న గడ్డిని ఈ యూనిట్ నుంచి మనం తీసుకుని, పశువులకు మేపవచ్చు.
- ⇨ ముఖ్యంగా ఇలా మొలకెత్తిన విత్తనాల నుండి మొలిచిన 5 రోజుల మొక్కజొన్న గడ్డిలో ప్రోటీన్లు ఎక్కువగా వుంటాయి. ఇందువల్ల పాలల్లో ఫ్యాట్ , ఎస్ఎన్ఎఫ్ శాతం పెరగడానికి సహాయపడుతుంది.

మన రైతు రెడ్డప్పరెడ్డి విషయంలో యిది అనుభవ పూర్వకంగా జరిగింది. ఆ వివరాలను చూద్దాం.

**హైడ్రోఫోనిక్స్ మొక్కజొన్న గడ్డి వాడకముందు (2 ఆవులకు)**

| నెల | పాల ఉత్పత్తి | ఫ్యాట్ | ఎస్ఎన్ఎఫ్ | రేట్ |
|---|---|---|---|---|
| మే | 10 లీ / రోజుకి | 3.4 -3.9 | 7.5-8 | 27-28 |
| జూన్ | 10 లీ /రోజుకి | 3.3-3.7 | 7.0 -7.5 | 27-28 |

**మొలిచిన 5 రోజుల మొక్కజొన్న గడ్డి వాడిన తర్వాత (2ఆవులకు)**

| నెల | పాల ఉత్పత్తి | ఫ్యాట్ | ఎస్ఎన్ఎఫ్ | రేట్ |
|---|---|---|---|---|
| జులై | 10 లీ / రోజుకి | 4-4.5 | 8.5-9 | 33-35/లీ |
| ఆగస్ట్ | 10 లీ / రోజుకి | 4-4.5 | 8.5-9 | 33-35/లీ |
| సెప్టెంబర్ | 10 లీ/రోజుకి | 4-4.5 | 8.5-9 | 33-35/లీ |

**ఖర్చు వివరాలు :**

**మొలిచిన 5 రోజుల మొక్కజొన్న గడ్డి వేయకముందు :**

- ⇨ 20 లీటర్లు రోజుకు / 2 ఆవులకు
- ⇨ 20 లీటర్లు 30 రోజులకి = 600 లీటర్లు / నెలకు
- ⇨ సరాసరి ధర = రూ. 26 /-
- ⇨ రూ. 26 600 లీటర్లు = 15,600/-

**మొలిచిన 5 రోజుల మొక్కజొన్న గడ్డి వేసిన తర్వాత:**

- ⇨ 20 లీటర్లు రోజుకి / 2 ఆవులకు
- ⇨ 20 లీటర్లు 30 రోజులకి = 600 లీటర్లు / నెలకు
- ⇨ సరాసరి ధర = 34 (మొక్కజొన్న గడ్డి వేయడం వలన ఫ్యాట్, ఎస్ఎన్ఎఫ్ శాతం పెరగడంతో మంచి ధర
- ⇨ రూ. 34 × 600 లీటర్లు = రూ. 20,400/-

**మొక్కజొన్న విత్తనానికి అయ్యే ఖర్చు:**

ఒక నెలకు మొక్కజొన్న విత్తనానికి అయ్యే ఖర్చు 45 కేజీలు / 2 ఆవులకు.

కేజీ = రూ. 25/-

45 కేజీలు = 25 × 45= 1125/-

ఒక నెలకు మొక్క జొన్న గడ్డి వేయకముందు, వేసిన తర్వాత వచ్చిన లాభము:

రూ. 20,400- 15,600 = 4800/-

విత్తన ఖర్చు రూ. 1125 పోగా

నికర లాభం రూ. 3675/-

**మొలిచిన 5 రోజుల మొక్కజొన్న గడ్డి ఉపయోగాలు:**

- ⇨ నాణ్యమైన ప్రోటీన్‌తో కూడిన ఆహారాన్ని పశువులకు అందిచవచ్చు.
- ⇨ చిన్న రైతులకు ఇంటి దగ్గరే తక్కువ స్థలంలో పశువులకు పచ్చగడ్డి నిరంతరం ఇవ్వవచ్చు.
- ⇨ అన్ని కాలాల్లో పశువులకు అవసరమైన పచ్చ గడ్డిని అందిచవచ్చు.
- ⇨ ఈ పచ్చ గడ్డిని రోజువారీగా ఇవ్వడం వలన పాలలో వెన్నశాతం పెరగుతుంది, మంచి ధర వస్తుంది.
- ⇨ తక్కువ సమయంలో (5 రోజులలో) నాణ్యమైన పచ్చి గడ్డిని పశువులకు ఇవ్వవచ్చు.

■

నీవు మోసే బరువు కంటె ఆ బరువును నీవు మోసే తీరే నిన్ను ఎక్కువగా కుంగదీస్తుంది

# కొనుగోలుదారులు, అమ్మకందారుల పరిచయ వేదిక !

– గోపాలరాజు

రైతు సంస్థల సుస్థిరాభివృద్ధి కృషిలో భాగంగా ఏపీమాస్ 23 నవంబరు 2021న అనంతపురంలోని ఏ. యఫ్. ఏకాలజీ సెంటర్ లో రైతు సంస్థలను, వ్యవసాయ ఉత్పత్తి కారకాల (అగ్రి ఇన్ పుట్స్) వ్యాపారం నిర్వహించే డీలర్స్ ను ఒకే వేదికమీదకు తీసుకువచ్చి 'కొనుగోలుదారులు, అమ్మకందారుల పరిచయ సమావేశాన్ని' (బయ్యర్స్, సెల్లర్స్ మీట్) నిర్వహించింది. ఈ సమావేశానికి అనంతపురం,





కర్నూలు జిల్లాలలో నాబార్డ్, ఏపిమాస్ ప్రోత్సాహంతో ఏర్పాటైన రైతు సంస్థల ప్రతినిధులు, వ్యవసాయ ఉత్పత్తి కారకాల అమ్మకందారులు హాజరైనారు.

ఏపిమాస్ గత 7 సంవత్సరాలుగా రైతు సంస్థలను ఏర్పాటుకు, వాటి సామర్థ్యం పెంపుదలకు, ఇతర సంస్థలు ఏర్పాటు చేసిన రైతు సంస్థల బలోపేతానికి, వాటి సుస్థిరాభివృద్ధికి పని చేస్తున్నది. రైతు సంస్థ ప్రోత్సాహక సంస్థలకు, సిబ్బందికి పాలకవర్గ సభ్యులకు శిక్షణ యివ్వడంకోసం 'ఇంక్యుబేషన్ సెంటర్'ను ఏర్పాటు చేసింది. రాయలసీమ ప్రాంతంలో నాబార్డ్ ఆర్థిక సహకారంతో ఇతర స్వచ్ఛంద సంస్థలు ప్రోత్సహిస్తున్న 59 రైతు సంస్థలను బలోపేతం చేయడంకోసం నాబార్డు వారు ఏపిమాస్ సంస్థను 'నాబార్డ్ రిసోర్స్ సపోర్ట్ ఆర్గనైజేషన్' (నాబార్డ్– ఆర్ ఎస్ ఏ) గా ఎంపిక చేశారు. ఈ బాధ్యతలో భాగంగా ఏపిమాస్ ఆ రైతు సంస్థల పాలకవర్గ సభ్యులకు వారి విధులు, బాధ్యతలు, శాసనాత్మక బాధ్యతలు, సిబ్బది విధులు భాధ్యతలు, పుస్తక నిర్వహణ, మార్కెటింగ్, విలువ జోడింపు వంటి అంశాలపై గత రెండు సంవత్సరాలలో శిక్షణలను, అవగాహన పర్యటనలను నిర్వహించింది.

రైతు సంస్థలు ఇప్పటివరకు రైతు సేవా కేంద్రాల ద్వారా, మన విత్తన కేంద్రం ద్వారా, మార్క్ఫెడ్ కోసం నిర్వహించిన విత్తన సేకరణ కేంద్రాల ద్వారా, ఇతరత్రా కొన్ని వ్యాపార కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి. ఈ సంస్థలు తమ సుస్థిరాభివృద్ధి కోసం ఇన్పుట్, అవుట్పుట్ మార్కెటింగ్ కార్యక్రమాలు చేయవలసి ఉన్నది. ముందుగా వ్యవసాయ ఇన్పుట్ వ్యాపారం గూర్చి అవగాహన కలిగించడం కోసం ఇన్పుట్ డీలర్స్ తో అనంతపురం, కర్నూలు జిల్లాలలో నాబార్డ్, ఏపిమాస్ ప్రోత్సాహంతో ఏర్పాటైన రైతు సంస్థల ప్రతినిధులకు పరిచయ వేదికను ఏపిమాస్ నిర్వహించింది. ఈ సమావేశానికి అనంతపురం జిల్లాలోని 25 రైతు సంస్థల నుండి 60 మంది పాలకవర్గ సభ్యులు, సిబ్బంది, కర్నూలు జిల్లాలో 25 రైతు సంస్థల నుండి 40 మంది పాలకవర్గ సభ్యులు, సిబ్బంది, ఉభయ జిల్లా ప్రోత్సాహక సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు.

ఏపిమాస్ సి ఇ ఓ, మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ సి.యస్. రెడ్డి ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సమావేశాన్ని నాబార్డ్ జిల్లా అభివృద్ధి మేనేజర్ (డి.డి.యం) శ్రీమతి ఉషా మధుసూదన్ అధ్యక్షత వహించారు. ఏ. యఫ్, ఏకాలజీ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ మల్లారెడ్డి ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొన్నారు. అనంతపురం జిల్లా ఉద్యాన శాఖ సహాయక సంచాలకులు శ్రీ సతీష్ సమావేశాన్ని ప్రారంభించారు.

సరైన ఆలోచనతో ముందడుగువేస్తే సమస్యలే అవకాశాలుగా అందివస్తాయి




వ్యవసాయం, అనుబంధ ఉత్పత్తి కారకాల అమ్మకందారుల తరపున టఫే, జైన్ ఇరిగేషన్, త్రిమూర్తి సీడ్స్, కోరమాండల్ ఫర్టిలైజర్స్, పురుగుమందుల డీలర్లు, కృష్ణా అగ్రి బయోటెక్ ఆర్గానిక్, వెంచూరా అగ్రి బయో టెక్ ఆర్గానిక్ ఫర్టిలైజర్స్, సెల్కో సోలార్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, వరబిక్స్ టానిక్స్ వంటి కంపెనీల డీలర్లు పాల్గొన్నారు. తమ సంస్థల ఉత్పత్తుల గూర్చి, రైతు సంస్థతో కలసి వ్యాపారంచేయడంలో ఆ సంస్థలు పాటించవలసిన విధి విధానాల గురించి వారు వివరించారు.

ఈ సమావేశం ప్రధాన ఉద్దేశం గురించి ఏపిమాస్ ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీ గోపాలరాజు వివరించారు.

డాక్టర్ మల్లారెడ్డి ప్రసంగిస్తూ, ఈ కొనుగోలుదారులు, అమ్మకందారుల సమావేశాన్ని ఏపిమాస్ నిర్వహించడం హర్షణీయమని, ఈ కార్యక్రమం వలన రైతు సంస్థల వ్యాపార కార్యక్రమాలు పుంజుకోవడానికి, వాటి సుస్థిరతకు ఎంతో దోహద పడుతుందని అన్నారు.

ఏపీమాస్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ సి. యస్. రెడ్డి మాట్లాడుతూ, ఈ సదస్సు ముఖ్య ఉద్దేశం వ్యవసాయ అనుబంధ ఉత్పత్తుల కారకాల డీలర్స్‌ను పరిచయం చేయడం మాత్రమేనని, అంతేతప్ప ఈ డీలర్స్ వద్దే కొనాలని లేదా ఈ కంపెనీల నుండి సరుకు కొనుగోలు చేయాలని చెప్పడం కాదన్నారు. ఈ సదస్సు ఉద్దేశాలను మీ రైతు సంస్థలలో చర్చించి, ఏ ఏ సీజన్‌లో ఎలాంటి ఇన్పుట్ కావాలి, ఎంత పరిమాణం కావాలి అనే విషయాలు నిర్ధారించుకుని, మీ రైతు సంస్థ ద్వారా వ్యాపారం చేయాలన్నదే ప్రధాన ఉద్దేశం. తద్వారా రైతు సంస్థ తమ సభ్యులకు మరింత మెరుగైన సేవలను అందించగలుగుతుందని, సంస్థ సుస్థిరాభివృద్ధి సాధించగలుగుతుందని పేర్కొన్నారు.

సమావేశంలో పాల్గొన్న బ్యాంకర్స్ తమ పరిధిలోని రైతు సంస్థ వివరణాత్మక ప్రాజెక్ట్ రిపోర్ట్‌ను, వ్యాపార ప్రణాళికను, సంబంధిత బ్యాంకులకు సమర్పించినట్లయితే వ్యాపారం కోసం ఋణ సదుపాయం కల్పించడానికి సహకరిస్తామని తెలియ జేశారు.

ఈ సమావేశానికి యింకా ఆనంతరపురం జిల్లా వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు శ్రీ చంద్రా నాయక్ లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ శ్రీ వెంకటరాజు, స్టేట్ బ్యాంక్ రీజినల్ మేనేజర్ శ్రీ రమేష్, జిల్లా సహకార బ్యాంక్ మేనేజరు, శ్రీ రామాంజనేయులు శ్రీ రాంజీ ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ క్రెడిట్ మేనేజర్ శ్రీ ఉమా మహేశ్వరరావు హాజరయ్యారు.

ఈ సమావేశానికి విచ్చేసిన రైతు సంస్థ పాలకవర్గ సభ్యులకు, సిబ్బందికి, ప్రోత్సాహక సంస్థ ప్రతినిధులకు, అధికారులకు, బ్యాంకర్స్‌కు, డి. డి. యం. ఉషా మధుసూదన్ గారికి, ఏపీమాస్ మేనేజింగ్ డైరెక్టర్ సి. యస్. రెడ్డిగారికి, ఏ. యఫ్. ఏకాలజీ సెంటర్ డైరెక్టర్ మల్లారెడ్డి గారికి, అందరికీ ఈ సదస్సును నిర్వహించిన ఏపిమాస్ ప్రాజెక్ట్ మేనేజర్ గోపాలరాజు గారు ధన్యవాదాలు తెలియచేసి సదస్సును ముగించారు. ■





స్నేహమంటే వెనుకాడకుండా సహాయపడేది, అడగకుండానే ఇచ్చేది, అనంతమైన ప్రేమను పంచేది

# ప్రభుత్వ శాఖలతో ధీశాలి సమన్వయ సమావేశం!

**– కె నిమ్మయ్య**

**ఆ**జీవ, ధీశాలి మహిళా రైతు ఉత్పత్తిదారుల సంస్థల ఆధ్వర్యంలో 25.11.2021 న ప్రభుత్వ శాఖలతో సలహా సంప్రతింపుల సమన్వయ సమావేశాన్ని (అడ్వకసి మీటింగ్) నిర్వహించడం జరిగింది. భువనగిరి జిల్లా స్థాయి పశు సంవర్ధక శాఖ, హార్టికల్చర్, జిల్లా సహకార సంస్థ, నాబార్డ్ సంస్థలతో ఈ సమన్వయ సమావేశాన్ని నిర్వహించాము. ఈ కార్యక్రమానికి అదనపు జిల్లా కలెక్టర్ శ్రీ దీపక్ తివారీ ముఖ్య అతిధిగా హాజరైనారు. డి ఏ ఓ అనూరాధ గారు, జిల్లా హార్టికల్చర్ ఆఫీసర్ అన్నపూర్ణ గారు, జిల్లా సహకార శాఖాధికారి పరిమళాదేవి గారు, పశు సంవర్ధక శాఖ నుంచి డాక్టర్ కృష్ణ గారు, నాబార్డ్ నుంచి డిడిఎం సత్యనారాయణ గారు, ఏపిమాస్ నుండి దివ్యశ్రీ గారు, కిషోర్‌కుమార్ గారు పాల్గొని సలహాలు, సూచనలు అందించారు.

ముందుగా ఈ కార్యక్రమానికి పీస్ సంస్థ డైరెక్టర్ శ్రీ నిమ్మయ్య అతిధులను వేదిక పైకి ఆహ్వానించి, సమావేశం ముఖ్య ఉద్దేశాలను, ఆజీవ ప్రాజెక్టు ప్రగతిని వివరించారు. ఆజీవ, ధీశాలి మహిళా రైతు ఉత్పత్తి సంస్థ పూర్తిగా 100 శాతం మహిళా రైతులే వాటాదారులను కలిగి ఉన్నాయని, గత 3 సంవత్సరాల నుంచి ఈ సంస్థ ద్వారా యదాద్రి–భువనగిరి జిల్లాలోని యాదగిరిగుట్ట, బొమ్మలరామారం మండలంలోని 20 గ్రామాలలోని రైతులకు ప్రయోగాత్మక సూచనలిస్తూ ముందడుగు వేస్తున్నాయని వివరించారు.

గ్రామీణ మహిళా మండలి అధ్యక్షురాలు డి. విజయలక్ష్మి గారు లింగ వివక్షతపై వ్యవసాయ రంగంలో చోటు చేసుకుంటున్న వ్యత్యాసలను వివరించారు. ధీశాలి, ఆజీవ కంపెనీలు సాధించిన ప్రగతిని వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పాల్గొన్న అదనపు కలెక్టర్ దీపక్ తివారీగారు మాట్లాడుతూ దేశ జనాభాలో సగ భాగమైన మహిళలు 12.5 శాతం మాత్రమే భూమిపై హక్కులను కలిగి ఉన్నారని, గత 3 సంవత్సరాలలో ఎప్పుడూ లేని విధంగా వర్షాలు కురుస్తున్నాయని, నవంబర్‌లో వర్షాలు పడటానికి కారణం వాతావరణంలోని శీతోష్ణస్థితి వలన వచ్చిన మార్పులు అని తెలిపారు. మారుతున్న కాలాన్ని బట్టి రైతులు పంటలు వేయాలని సూచించారు. మన దేశంలో సిక్కిం రాష్ట్రంలో 100 శాతం సేంద్రీయ వ్యవసాయం చేస్తున్నారని, ఆ రాష్ట్ర ఉత్పత్తులను ఇతర దేశాలకు ఎగుమతి చేస్తున్నారని తెలిపారు. వ్యవసాయంలో పెట్టుబడి తగ్గించడానికి సహజంగా లభించే సేంద్రీయ వ్యర్థాలను, పచ్చిరొట్ట, చెరువు మట్టి లాంటివి ఉపయోగించి అధిక దిగుబడి సాధించాలని సూచించారు. ఆజీవ, ధీశాలి కంపెనీలు ఆదర్శంగా వున్నాయని ప్రశంసించారు.

డాక్టర్ కృష్ణ గారు మాట్లాడుతూ మహిళలు సమిష్టిగా ముందుకు వస్తే డెయిరీ పరిశ్రమలో పనీర్, ఐస్‌క్రీమ్‌ల తయారీ, బీడు భూములను పశుగ్రాసాలుగా మార్చుటకు, పెద్ద మొత్తంలో పాడి పశువులను పెంచుటకు, గొర్రెల పెంపకానికి అవకాశాలు ఉన్నట్లు తెలిపారు.

అన్నపూర్ణ గారు మాట్లాడుతూ రైతు బజారులలో కూరగాయలు అమ్మే విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేయడానికి సిద్ధంగా వున్నామని తెలిపారు.

అనురాధ గారు మాట్లాడుతూ చిరుధాన్యాలతో వివిధ రకాలుగా విలువ ఆధారిత తినుబండరాలను తయారు చేసి అమ్మినట్లయితే పలు విక్రయకేంద్రాలను కేటాయిస్తారని తెలిపారు.

**ప్రభుత్వానికి ఆజీవ, ధీశాలి డిమాండ్లు**

ఆజీవ , ధీశాలి మహిళా రైతు ఉత్పత్తిదారుల కంపెనీలు పూర్తిగా 100% మహిళలచే 2018లో రిజిస్ట్రేషన్ చేయబడినవి. గత మూడు సంవత్సరముల నుండి అంచెలంచెలుగా ఎదుగుతూ మగవారే కాదు మహిళలు కూడా పురుషులతో సమానంగా అన్ని రంగాలలో

రాణించగలరని అన్ని సంస్థలకు స్ఫూర్తిదాయకంగా ముందుకు దూసుకెళ్ళుచున్నది.

అజీవ మహిళా రైతు ఉత్పత్తి సంస్థ యాదగిరిగుట్ట మండలంలోని 10 గ్రామాలలో విస్తరించి 500 పైగా మహిళా రైతులతో ఇతర ఎఫ్.పి.ఓ.లకు దీటుగా డెమో ప్లాట్లు, విత్తన ఉత్పత్తి, సంప్రదాయ పంటల పునరుత్పత్తి, చిరుధాన్యాల పంటలను ప్రోత్సహిస్తూ ముందుకు వెళుతున్నది. అలాగే అజీవ కంపెనీ ఆధ్వర్యంలో సాదువెల్లి గ్రామంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసినారు.

ధీశాలి మహిళ ఉత్పత్తిదారుల కంపెనీ బొమ్మల రామారంలోని 10 గ్రామాలలో 500 మంది మహిళా రైతులతో విస్తరించింది. ధీశాలి మహిళా రైతు ఉత్పత్తిసంస్థ పేరుకు తగ్గట్టుగా మహిళా రైతులతో కలిసికట్టుగా వ్యవసాయ రంగంలో వ్యాపారదక్షతను నిరూపించుకుంటున్నారు. ధీశాలి రైతులు కూరగాయలు, బంతిపూలు, వరి పంటలకు సంబంధించిన వ్యాపారాలు చేస్తుండగా గత యాసంగిలో, వానాకాలంలో ప్యారారం గ్రామంలో కొనుగోలు కేంద్రాన్ని నిర్వహించారు.

మహిళల సారథ్యంలో ప్రారంభించిన ధీశాలి, ఆజీవ రైతు ఉత్పత్తిదారుల కంపెనీలకు అన్ని రంగాలలో గుర్తింపు, ప్రత్యేక ప్రతిపత్తి ఇవ్వవలసిన బాధ్యత ప్రభుత్వానిదేనని, మహిళలే నిర్వహిస్తున్న ఈ సంస్థలకు అన్ని ప్రభుత్వశాఖలలో కూడా అన్నిరకాల రాయితీలు, మద్దతు వర్తించేటట్లు సహకరించాలని ఈ క్రింది డిమాండ్స్‌ను ఈ సమావేశం ద్వారా ప్రభుత్వానికి తెలియజేస్తున్నట్టు ఆజీవ, ధీశాలి సంస్థలు పేర్కొన్నాయి. ఆ డిమాండ్లు యివి:

1. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల మాదిరిగానే (పి.ఎ.సి.ఎస్) మహిళా రైతు ఉత్పత్తిదారుల కంపెనీలను గుర్తించాలి. అందులోను మహిళా రైతు సంస్థలకు ఎక్కువ అవకాశాలు కల్పించాలి.
2. వరికి, కందులకు కొనుగోలు కేంద్రాలను కేటాయించే క్రమంలో మహిళా ఎఫ్.పి.ఓ.లకు ముందు అవకాశం ఇవ్వాలి.
3. వ్యవసాయ రంగంలో పని చేస్తున్న మహిళా రైతులను పురుషులతో సమానంగా గుర్తించాలి.
4. సేంద్రియ వ్యవసాయ పద్ధతులు పాటించి వ్యవసాయం చేస్తున్న మహిళా రైతు కంపెనీలకు, రైతులకు ప్రత్యేకమైన సబ్సిడీలు యివ్వాలి.
5. మహిళలు సమిష్టిగా చేపట్టే ఏ కార్యక్రమానికైనా ప్రభుత్వాలు మద్దతుయిచ్చి ప్రోత్సహించాలి.
6. మహిళా రైతు ఉత్పత్తిదారుల కంపెనీలకు కస్టమ్ హైయర్ సెంటర్స్ కేటాయించి అన్నిరకాల వ్యవసాయ పనిముట్లను అందుబాటులోకి తేవాలి.
7. కృషి విజ్ఞాన కేంద్రాలలో మహిళలకు ట్రాక్టర్స్, వీడర్స్, స్ప్రేయర్స్‌ను ఉపయోగించేటట్లు డ్రైవింగ్‌లోను, మైనర్ రిపేర్లు చేసుకోవడంలోను శిక్షణలు ఇవ్వాలి.
8. గ్రామీణ మహిళల వ్యవసాయ ఉత్పత్తులకు ప్రత్యేక ఎంటర్‌ప్రైజ్ కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రోత్సహించాలి.
9. రైతులను కార్పొరేట్ కంపెనీల దోపిడి నుండి రక్షించాలి. పంట భూములను ప్రయివేటు కార్పొరేటు కంపెనీలకు ధారాదత్తం చేసే చట్టాలను రద్దు చేయాలి.
10. రైతులు పండించిన అన్ని పంటలకు కనీస మద్దతు ధర ఇచ్చి ఆదుకోవాలి.
11. సమగ్ర వ్యవసాయాన్ని పాడి, పంటలు, సన్నజీవాలు, కోళ్ళ పెంపకం, పండ్ల తోటలు, పూల తోటలతో పాటు చేపల పెంపకంలో శిక్షణలు, సూచనలు ఇచ్చి ప్రోత్సహించి రైతులను ఆదుకోవాలి.
12. మహిళా రైతు ఉత్పత్తిదారుల సంస్థలకు, 50% మహిళలు ఉన్న సంస్థలకు ఎక్కువ ప్రోత్సాహం కల్పించాలి.
13. వ్యవసాయంలో లైంగిక సమానత్వాన్ని రైతులు, అన్ని ప్రభుత్వ శాఖలు పాటించేలా చూడాలి.
14. గ్రామాలలో చిరువ్యాపార, చిన్న పరిశ్రమల ఏర్పాటుపై మహిళా ఎఫ్.పి.ఓ.లకు శిక్షణలు యివ్వాలి.
15. మహిళలకు సులువుగా వుండి పని చేయడానికి ఉపయోగపడే పనిముట్లను సబ్సిడీపై అందజేయాలి. ■

# వరి సాగును తగ్గించడం ఎలా?

– కన్నెగంటి రవి, రైతు స్వరాజ్య వేదిక

వరి ధాన్యం తెలంగాణ ప్రజల ప్రధాన ఆహార పంట. ఇటీవల ఈ పంటకు మరో ప్రాధాన్యాన్ని కూడా పాలకులు సంతరింప చేశారు. 'కాళేశ్వరం ప్రాజెక్టుతో సాకారమైన కోటి ఎకరాల మాగాణం' గురించి ప్రభుత్వం ప్రజలకు చెవిలో పూలు పెట్టడానికి కూడా రాష్ట్రంలో విస్తరిస్తూ వచ్చిన వరి సాగు విస్తీర్ణం పనికొచ్చింది. అయితే ఇప్పుడు వరి ధాన్యం సాగు అంటేనే రాష్ట్ర ప్రభుత్వం భయపడుతున్నది. 'వరి వేస్తే ఉరే' అని ప్రకటిస్తున్నది. రైతులు వరి కాకుండా ప్రత్యామ్నాయ పంటలు పండించేలా గ్రామాలకు వెళ్ళి ప్రచారం చేయాలని వ్యవసాయ విస్తరణ అధికారులను పరుగులు పెట్టిస్తున్నది.

వరి సేద్యానికి అలవాటు పడిన రైతులు వ్యవసాయ అధికారుల మాటలను పట్టించు కోవడం లేదు. అధికారులకు అనేక ప్రశ్నలు వేస్తున్నారు. రైతులు అడుగుతున్న ప్రశ్నలన్నీ అత్యంత న్యాయమైనవి. జవాబులు వెతక వలసినవి. నిజానికి ఈ ప్రశ్నలకు జవాబు గ్రామాలలో తిరిగే వ్యవసాయ విస్తరణ అధికారులు ఇవ్వలేరు. ప్రభుత్వం రైతుల ప్రశ్నలన్నిటికీ స్పష్టమైన జవాబులతో ఒక విధాన పత్రం వెంటనే విడుదల చేయాలి.

2020 ఖరీఫ్‌కు ముందు అనేక చర్చల తర్వాత, జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఒక పంటల ప్రణాళిక తయారు చేసి, ప్రభుత్వానికి నివేదించింది. 'తెలంగాణలో వరి సేద్యం – సమస్యలు' పేరిట ఒక నివేదికను 'రైతు స్వరాజ్య వేదిక' ఆరు నెలల క్రితమే విడుదల చేస్తే ప్రభుత్వం దానిని చూసీ చూడనట్లు వ్యవహరించింది.

తెలంగాణ జనాభా ఇంచుమించు 4 కోట్లు. 'భారతీయ వైద్య పరిశోధనా మండలి' (ఐసీఎమ్ఆర్) సిఫారసుల ప్రకారం (మొత్తం రోజుకు అవసరమైన 400 గ్రాముల తృణ ధాన్యాలలో బియ్యం 200 గ్రాములు, గోధుమలు 80 గ్రాములు, జొన్న 60 గ్రాములు, కొర్ర 20 గ్రాములు, రాగి 10 గ్రాములు, సజ్జ 10 గ్రాములు, మొక్క జొన్న 20 గ్రాములుగా తీసుకున్నాము) కావలసిన వరి బియ్యం సంవత్సరానికి సుమారు 27,85,000 టన్నులు. ఇందుకు అవసరమైన ధాన్యం 40,00,000 టన్నులు.

ప్రకృతి వైపరీత్యాల నష్టాలను దృష్టిలో ఉంచుకున్నా



రాష్ట్ర జనాభాకు అవసరమైన మొత్తం ధాన్యం 53,00,000 టన్నులు. ప్రభుత్వ నివేదికలు చెప్పినట్లు ఎకరానికి 2 టన్నుల ధాన్యం దిగుబడి వస్తుంది అనుకుంటే కావలసిన సాగు భూమి 26,50,000 ఎకరాలు.

'భారత ఆహార సంస్థ' (ఎఫ్‌సిఐ) రెండు సీజన్లలోనూ కలిపి బయట రాష్ట్రాల కోసం లేదా బఫర్ స్టాక్ కోసం మరో 60 లక్షల టన్నుల ధాన్యం సేకరిస్తుంది అనుకుంటే అందుకు కావలసిన భూమి మరో 30 లక్షల ఎకరాలు. రెండు సీజన్లకూ కలిపి మొత్తం అవసరమైన భూమి 56,50,000 ఎకరాలు. మనం ఇప్పుడు ఒక సీజన్‌లో పండిస్తున్న వరి ధాన్యం సరిపోతుందన్నమాట. రెండు సీజన్లు కలిపి కనీసం సగం భూమిలో వరి సేద్యం తగ్గించాలన్న

మాట. కేంద్రానికి ఉండే రకరకాల ఒత్తిళ్ళ రీత్యా, భవిష్యత్తులో తెలంగాణ ఎంత వరి పండించినా దానిని పూర్తి స్థాయిలో సేకరించే స్థితిలో ఉండదని గుర్తించాలి. అందువల్ల కూడా వరి విస్తీర్ణాన్ని అదుపు చేయాలి. నడచిన వానాకాలంలో రైతులు పండించిన దొడ్డు ధాన్యంతో సహా వరి ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఎఫ్‌సిఐ ని ఒప్పించాలి. ఈ యాసంగిలో రైతులు అనివార్యమైన స్థితిలో వరి సాగు చేస్తే, రైతులు నష్టాలలో కూరుకు పోకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. ఇప్పటికే వరి పంట సాగుకు అలవాటు పడిన రైతులు ప్రత్యామ్నాయ పంటలు వేయడానికి అంత సుముఖంగా లేరు. కారణాలు అనేకం. నీరు అందు బాటులో ఉంటే వరి సాగు చేయడం తేలిక. ట్రాక్టర్లు, హార్వెస్టర్లు, నాటు వేసే యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి కనుక, వరి రైతుల పని సులభం అవుతుంది.ఇతర పంటలకు అలాంటి యంత్రాలు అందుబాటులో లేవు.కూలీల కొరత ఉన్న ప్రాంతాలలో ఇతర పంటల సాగు కష్టం. పైగా అడవిపందులు, కోతుల సమస్య ఉండనే ఉంది.

వరి ధాన్యాన్ని ఎఫ్‌సిఐ కోసం రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ప్రతి సీజన్‌లో కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) చెల్లించి సేకరిస్తుంది. మిగిలిన పంటలను అలా ప్రభుత్వం సేకరించడం లేదు కదా. అందువల్ల ఆయా పంటలకు కనీస మద్దతు ధర అందడం లేదు. వివిధ పంటలతో పోల్చినప్పుడు సీఏసీ పీ (వ్యవసాయ వ్యయాలు, ధరల కమిషన్) అంచనాల ప్రకారం వరి పంట లోనే రైతుకు నికర మిగులు ఎంతో కొంత ఉంటున్నది.

రాష్ట్ర ప్రభుత్వం ప్రచారం చేస్తున్నట్లుగా పూర్తిగా వరి సేద్యం ఆపేయడం సాధ్యం కాదు. అందువల్ల రాష్ట్ర బియ్యం అవసరాల కోసం, ఎత్తిపోతల విద్యుత్ ఖర్చు లేకుండా ఇప్పటికే నిర్మాణమై ఉన్న సాగు నీటి ప్రాజెక్టుల క్రింద, చెరువుల క్రింద దశాబ్దాలుగా గ్రావిటీ ద్వారా నీరు అందుతున్న ప్రాంతాలకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి వరి సాగు ప్రణాళిక చేయాలి. ఆ ప్రాంతాలలో భూములు ఇప్పటికే వరి సేద్యానికి మాత్రమే అనువైనవిగా మారిపోయాయి కనుక, ఈ ప్రాధాన్యత ఇవ్వడం అవసరం. ఆయా జిల్లాలలో గ్రావిటీ ద్వారా అందే సాగు నీరు తగినంత అందుబాటులో ఉండి, వరి వేసిన తర్వాత కూడా ఇంకా సాగు భూములు ఉంటే, భారత ఆహార సంస్థ ద్వారా కేంద్ర నిల్వల కోసం బియ్యం సేకరణ అవసరాలకు, ముందస్తు ఒప్పందాలతో ఇతర రాష్ట్రాల లేదా ఎగుమతి అవసరాల కోసం వరి సాగు ప్రణాళిక చేసుకోవాలి.

వరి సాగును నిలువరించడానికి ప్రైవేట్ కంపెనీలు వరి విత్తనాలు అమ్మకూడదని ప్రభుత్వం ఆదేశించింది. బాగానే ఉంది. మరి మిగిలిన పంటలకు నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉన్నాయా? మంచి దిగుబడులు ఇచ్చే విత్తనాలు లేవు. కంపెనీలు నకిలీ విత్తనాలు అమ్మడం వల్ల రైతులు ప్రతి సంవత్సరం పంటలు నష్ట పోతున్నారు. పైగా కంపెనీ విత్తనాల ధరలు ప్రతి సంవత్సరం పెరిగి పోతున్నాయి. విత్తనాలను రైతులకు, రైతు సహకార సంఘాలకు నేరుగా, ఉచితంగా అందించాలి. ఇప్పటికే వరి విత్తనాలు తయారు చేసుకుని అమ్మకానికి సిద్ధంగా ఉంచుకున్న రైతు సహకార సంఘాలు నష్ట పోకుండా, వారి నుంచే అవసరమైన వరి విత్తనాలు ప్రభుత్వం సేకరించాలి.

రైతు కుటుంబాలకు ఆదాయాలు ముఖ్యం. పంటల ఉత్పత్తి ఖర్చులు పెరిగిపోతున్న స్థితిలో ఏ పంటలో ఎక్కువ ఆదాయం వస్తుందో చూసి ఆ పంటలను సాగు చేయడానికి రైతులు ప్రయత్నం చేస్తారు. ఇంతకాలం ప్రభుత్వాలు గోధుమ, వరి లాంటి ఒకటి రెండు పంటలకే మద్దతు వ్యవస్థలు ఏర్పాటు చేసి మిగిలిన పంటలను గాలికి వదిలేశాయి. ఈ తప్పు దశాబ్దాలుగా జరుగుతూ వచ్చింది. ఇది సరిదిద్దకుండా, వరి మానేసి ఇతర పంటల వైపు రైతులు మళ్లడం సాధ్యం కాదు.

వరి విస్తీర్ణం తగ్గించడానికి, రాష్ట్రంలో వ్యవసాయా ధారిత పరిశ్రమలకు ముడి సరుకులను అందించడానికి ఇతర పంటల ప్రణాళిక అవసరం. ముఖ్యంగా ప్రభుత్వ, సహకార రంగాలలో చక్కెర పరిశ్రమలను ఏర్పాటు చేయగలిగితే చక్కెర, బెల్లం లాంటి అవసరాల కోసం, మొలాసిస్ లేదా ఇథనాల్ ఉత్పత్తి కోసం చెరకు లాంటి పంటల విస్తీర్ణం పెరుగుతుంది. ఇప్పటికే జగిత్యాల,

సంగారెడ్డి, నిజామాబాద్, మెదక్ లాంటి జిల్లాల రైతులు, స్థానికంగా ఉన్న ప్రభుత్వ, సహకార చక్కెర ఫ్యాక్టరీలను తగిన మరమ్మత్తులు చేసి పునరుద్ధరించాలని కోరుతున్నారు. వెంటనే అందుకు అనుగుణమైన చర్యలు చేపట్టాలి.

ప్రభుత్వం 2018లో 'రైతు సమన్వయ సమితి'ని ఏర్పరచినప్పుడు ఒక జీఓ విడుదల చేసింది. అవసరమైతే, ఆ సంస్థ రిటైల్ షాపులను ఏర్పాటు చేసి, రైతుల నుంచి నేరుగా సేకరించి, ప్రాసెస్ చేసి ప్రజలకు తక్కువ ధరలకు సరుకులు అమ్ముతుందని ఆ జీఓలో పేర్కొన్నారు. ఇప్పుడు సమయం వచ్చింది. కాబట్టి ఈ సంస్థను రంగంలోకి తెచ్చి, రైతుల నుంచి నేరుగా ఉత్పత్తులను సేకరించి వినియోగ



దారులకు రిటైల్ షాపుల ద్వారా అమ్మించే ఏర్పాట్లు చేయాలి. ప్రకృతి వైపరీత్యాలు పెరుగుతున్నందున, అన్ని పంటలకూ గ్రామం యూనిట్‌గా పంటల బీమా పథకాలను అమలు చేయాలి. ఆంధ్ర ప్రదేశ్ తరహాలో బీమా ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లించాలి. అడవి పందులు, కోతులు వల్ల జరిగే నష్టాలనుకూడా బీమాపరిధిలోకి తీసుకు రావాలి. కూరగాయలు, పండ్ల తోటలకు కూడా బీమా వర్తింపచేయాలి.

రైతులు కూడా తమ వ్యవసాయం గురించి స్వతంత్రంగా ఆలోచించాలి. గ్రామస్థాయిలో కూర్చుని రైతులందరూ చర్చించాలి. స్థానిక ప్రజా ప్రతినిధులు, స్థానిక ప్రభుత్వ అధికారులు, శాస్త్రవేత్తలు, సహకార సంఘాలు, రైతు సంఘాలు ఈ చర్చలలో భాగస్వాములు కావాలి. గ్రామం కోసం ప్రభుత్వాలను నిర్దిష్టంగా ఏమి అడగాలో ఈ చర్చలలో నిర్ణయించుకోవాలి. ■

## కేంద్ర ప్రభుత్వ కార్మిక బీమా పథకం

- ⇨ ప్రభుత్వ ఉద్యోగులు తప్ప, కూలీలతో పాటు అందరు అర్హులే
- ⇨ తెల్ల రేషన్ కార్డు తప్పని సరి
- ⇨ ఏడాదికి 22 రూపాయల వంతున చెల్లిస్తే చాలు

బి. 5 సంవత్సరాలకు ఒకేసారి చెల్లించాలి. అంటే కేవలం 110 రూపాయలు మాత్రమే

1) 18 నుండి 55 సంవత్సరములు ఉన్న స్త్రీ, పురుషులు అర్హులు
2) ప్రభుత్వ ఉద్యోగులు తప్ప ఎలాంటి కూలీలైన, ఇతరులైన ఇందులో చేరవచ్చు.
3) రేషన్ కార్డు, ఆధార్ కార్డు, జిరాక్స్ జత చేయాలి
4) బ్యాంకు చలానా జత చేసి లేబర్ ఆఫీస్‌లో ఇవ్వాలి.

**ప్రయోజనాలు**

5) పాలసీదారు సహజ మరణం పొందితే . 1,30,000/-రూపాయలు బీమా సదుపాయం
6. ప్రమాదవశాత్తూ మరణిస్తే రూ. 6,00000 చెల్లింపు
7) ఒక ఇంట్లో ఇద్దరు ఆడపిల్లలు వుంటే ఒకొక్కరికి వివాహ నజరానాగా రూ. 30,000/-
8) ప్రసవ కానుకగా రెండు ప్రసవాలకు రూ. 30,000/-చొప్పున వచ్చే అవకాశం ఉంది.
9) 1 సంవత్సరం పాలసీ పొందిన తరువాత లబ్ధిదారునికి
   ప్రమాదం జరిగి 50% అంగ వైకల్యం ఏర్పడితే 2.50 లక్షలు, 100% ఉంటే 5 లక్షల పరిహారంగా అవకాశం

- ⇨ ఈ లేబర్ ఇన్సూరెన్స్ ఒకసారి 110/-రూ.చెల్లిస్తే 5 సంవత్సరాల వరకు చెల్లించనక్కర్లేదు. అంటే మీరు చెల్లించేది సంవత్సరానికి రూ. 22/- అన్నమాట
- ⇨ మీ మండలంలోని కార్మిక అధికారిని (లేబర్ ఆఫీసర్), ఎం పి డి ఓ లేదా ఎం ఆర్ ఓ ను సంప్రదించండి. ■

# గొర్రెలను వేధిస్తున్న కాలిపుండ్ల వ్యాధి

– డాక్టర్ ఎం. భార్గవి

**ఈ** ఏడాది అధిక వర్షాలు కురవడంతో గొర్రెలు, మేకలు కాలిపుండ్ల వ్యాధి బారినపడి గొర్రెల పెంపకందారులు తీవ్రంగా నష్టపోతున్నారు. వరి కోతలు కోసిన పొలాల్లో



జీవాలు తిరిగితే ఈ వ్యాధి తీవ్రత పెరిగే అవకాశం ఉంది.

గిట్టల వ్యాధిని నిర్లక్ష్యం చేస్తే గొర్రెలు, మేకలు మృత్యువాత పడే ప్రమాదం ఉంది. కాళ్ల గాయాలు, గిట్టల పుండ్లు, బురద పుండ్లు, మిత్తువ కాళ్లు తదితర పేర్లతో పిలుస్తారు. ఈ వ్యాధి అన్ని వయస్సుల గొర్రెలు, మేకలకు (ఎక్కువగా మేకలకు) వస్తుంది. వ్యాధి లక్షణాలు, నివారణ పద్ధతులను తెలుసుకుని ముందుగానే గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకుంటే జీవాలను కాపాడుకోవచ్చని సూచిస్తున్నారు.

**వ్యాధి కారకాలు....**

జీవాలు బురద నేలల్లోను, కాలువలు, చెరువులు, నదుల వెంట తిరిగినప్పుడు, వరికోత తరువాత పొలాల్లో తిరిగి నప్పుడు ఈ వ్యాధి సోకుతుంది. స్పోరోఫోరస్, ఫుసిబాక్టీరియమ్ నెక్రోఫోరిస్ అనే బ్యాక్టీరియా ద్వారా మేకలు, గొర్రెలకు వ్యాపిస్తుంది.

**ఈ వ్యాధి లక్షణాలు ఇలా.......**

గిట్టల మధ్య చర్మం మెత్తబడి వాపు వచ్చి చిట్లిపోతుంది. నొప్పితో గొర్రెలు, మేకలు ముందు కాళ్లతో కుంటుతుంటాయి. వ్యాధి తీవ్రంగా ఉంటే గిట్టలూడి జీవాలు నడవలేకపోతాయి. మందల్లో వ్యాధిగ్రస్త జీవాలు కుంటుతూ, నడవలేక మంద వెనకబడిన వాటిని గుర్తించాలి.

**నిర్ధారణ :** గిట్టల మధ్య చర్మం ఎర్రగా మారుతుంది. తరువాత గిట్టల మధ్య వాపు వస్తుంది. దాని నుంచి చీము వచ్చి చెడు వాసన వస్తుంది. ఆ తరువాత గిట్టలకు ఈ వ్యాధి వచ్చిన కొన్ని సమయాల్లో గిట్టలు ఊడిపోతాయి.

**వ్యాధి వ్యాప్తి ఇలా....**

వ్యాధి వచ్చిన గొర్రెల గిట్టలను మరో గొర్రె తాకితే ఈ వ్యాధి విస్తరిస్తుంది. వ్యాధి సోకిన జీవాలు ఉండే ప్రదేశాలలో వేరొక గొర్రెల మందలు తిరగటం వల్ల



వ్యాధి వ్యాపిస్తుంది. వ్యాధి సోకిన జీవాలను మంద నుంచి వేరు చేయాలి.

**చికిత్స ఇలా........**

⇨ గొర్రెల, మేకల కాళ్లను 10 శాతం జింక్ సల్ఫేట్ లేదా





ఫార్మలిన్ ద్రావణంలో 5 నిమిషాలు ముంచాలి. తరువాత లోరాక్సేన్ ఆయింట్‌మెంట్‌ను పూయలి.

- ➪ సెఫ్రిట్రాక్సెన్ అనే యాంటీబయోటిక్ ఇంజక్షన్లు వరుసగా 3–5 రోజులు వేయించాలి. కాళ్లనొప్పులు తగ్గడానికి మెలోనేక్స్ ఇంజక్షన్లు వరుసగా 3–5 రో. వేయించాలి.
- ➪ కాలిపుండ్ల వ్యాధితో ఉన్న గొర్రెలు, మేకలు మేత మేయకుండా నీరసించి ఉంటాయి. అలాంటి వాటిని ప్రత్యేకంగా మంద నుంచి వేరు చేసి రాగి జావను తాపించాలి. ఆ తరువాత ఎండు మేతను వేసి మేపాలి.
- ➪ గొర్రెలు రాత్రిళ్లు ఉండే మంద వద్ద గానీ, కొట్టాల్లో గానీ వేప ఆకుల పొగను పెట్టాలి. ఎందుకంటే రోగకారక క్రిములు ఆ పొగ దెబ్బకు ఆ మంద దరిదాపుల్లోకి రాకుండా పోతాయి.

**నివారణ ఇలా చేపట్టాలి.........**

- ➪ జీవాల్ని చిత్తడి నేలల్లో ఎక్కువ సేపు తిరగనీయవద్దు. పొడిగా ఉండే ప్రదేశాల్లో మేపాలి.
- ➪ సిమెంట్ ఫుట్‌బాత్ ఏర్పాటు చేసి దాంట్లో 8% పొటాషియం పర్మాంగనేటు ద్రావణంపోసి ఆ ద్రావణం లో జీవాలను ప్రతి రోజు 3–5 నిమిషాలు నడిపించాలి.
- ➪ వ్యాధి సోకిన గొర్రెలను మంద నుంచి వేరుచేసి చికిత్స బాగా చేయించాలి. వ్యాధితో ఉన్న గొర్రెలను, మేకలను బాగున్న వాటితో కలవనీయకుండా చూసుకోవాలి.
- ➪ వ్యాధి సోకిన గొర్రెలు, మేకలు ఉండే మందల నుంచి గొర్రెలను కొనుగోలు చేయవద్దు.
- ➪ వ్యాధి సోకిన గొర్రెలను వేరే ప్రదేశాలకు లారీల్లోగానీ, ట్రాక్టర్లల్లో గానీ రవాణా చేయవద్దు. ■




## ధరణి ఎఫ్ పి ఓ కు బొలెరో వాహనం !

**ధ**రణి ఎఫ్ పి ఓ కు ఏపిమాస్ సహకారంతో 'ట్రిజియో టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్' వారు బొలెరో వాహనాన్ని సమకూర్చుకోవడం కోసం రూ. 5,00,000/– రూపాయలు గ్రాంట్‌గా యిచ్చారు. దీనితో పాటు ధరణి ఎఫ్ పి ఓ వారు యూనియన్ బ్యాంక్ సదాశివనగర్ బ్రాంచ్ లో 4,00,000/– రూపాయలు లోన్ తీసుకొని బొలెరో వాహనాన్ని కొనుగోలు చేశారు. ఈ వాహనాన్ని ఉపయోగించి తమ సంస్థ కలని పని చేస్తున్న 'మెట్రో', 'అక్షయ పాత్ర' సంస్థలకు కూరగాయలు, పండ్ల సరఫరాకు, ధరణి రైతు సేవా కేంద్రానికి అవసరమైన వ్యవసాయ పరికరాలు ఇ సరుకుల సరఫరాకోసం ఉపయోగిస్తామని ధరణి బోర్డు సభ్యులు తీర్మానించారు. వాహనం కొనుగోలుకు తమకు గ్రాంటును అందజేసిన ట్రిజియో టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు,ఆ గ్రాంట్ రావడానికి సహకరిమచిన ఏపిమాస్ సంస్థకు వారు ధన్యవాదాలు తెలిపారు. ■




నీ ఆనందానికి సృష్టికర్తవు నీవే; నీ డబ్బో,బాంధవ్యమో,పదవో, పరిస్థితులో కావు

# అధిక వర్షాల ముప్పునుంచి పంటలకు రక్షణ

**ఆం**ధ్రప్రదేశ్‌ను అధిక వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. ఒకదాని వెంట ఒకటిగా విరుచుకుపడుతున్న తుపానులు, అల్ప పీడనాలకు ముఖ్యంగా రాయలసీమ, నెల్లూరు జిల్లాలలో పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. వారాల తరబడి పంటలు నీటమునిగి వుండడంతో పంటలు పొలాలలోనే కుళ్ళిపోయే ప్రమాదం పొంచి వుంది. ఈ ప్రకృతి విపత్తును దృష్టిలోవుంచుకుని డాక్టర్ వై ఎస్ ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం రైతుల సలహా కేంద్రం శాస్త్రవేత్తలు డా. కె.టి. వెంకటరమణ, డాక్టర్ ఎం.రవీంద్రబాబు, డాక్టర్ ఆర్. నాగరాజు అధిక వర్షాల ముప్పునుంచి పండ్లతోటలు, కూరగాయల పంటలు, పూలతోటలను కాపాడుకునే మార్గాలను వివరిస్తూ ఒక కరపత్రాన్ని రైతుల ప్రయోజనం కోసం రూపొందించి విడుదలచేశారు. ఆ వివరాలను డాక్టర్ వై ఎస్ ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం సౌజన్యంతో అందిస్తున్నాం.

**తెం**పులేకుండా చాలారోజుల పాటు వానలు కురిసినా, పొలాలలో నీరు చాలా రోజుల పాటు నిలువ వున్నా పంటలకు చీడపీడల ఉధృతి పెరుగుతుంది, వేర్లు కుళ్ళి మొక్కలు చనిపోతాయి, భూమిలోని పోషకాలు మొక్కలకు అందకుండా పోతాయి, విత్తనాలు మొలకెత్తకుండా పోయే అవకాశం ఉంది, గాలిలో తేమ శాతం పెరగడం వలన రక్షిత గృహాలలో కూడా బూడిద తెగులు, ఇతర తెగుళ్ళ ఉధృతి పెరుగుతూ వస్తుంది. సేద్యపు పనులు ఆలస్యమవడం, కలుపు బెడద ఎక్కువవడం, పరాగ సంపర్కం తగ్గిపోవడం, హార్మోన్లపై నీటి ముంపు ప్రభావం పడడం వంటి ఇతర దుష్ఫలితాలు కూడా వుంటాయి. ఈ పరిస్థితులలో సాధారణంగా అన్ని పంటలకు తీసుకోవలసిన జాగ్రత్తలతో పాటు, ఒక్కొక్క పంటకు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవలసి వుంటుంది.

**సాధారణంగా తీసుకోవలసిన జాగ్రత్తలు**

- ➪ వీలైనంత త్వరగా చేలల్లో అధికంగా ఉన్న నీటిని తీసివేయాలి.
- ➪ పంట ఎదుగుదలకు తోడ్పడే విధంగా బూస్టర్ డోస్ ఎరువులను వేసుకోవాలి.
- ➪ అధిక తేమ వలన ఉధృతి పెరిగే అవకాశం గల తెగుళ్ళు, పురుగుల నివారణ చర్యలు చేపట్టాలి.
- ➪ లేత తోటలలో చనిపోయిన మొక్కలను తీసివేసి క్రొత్త మొక్కలను నాటుకోవాలి.
- ➪ వర్షాలు తగ్గగానే వీలైనంత త్వరగా చెట్ల మధ్య దున్నడం వలన తేమ త్వరగా ఆరి చెట్లు కోలుకుంటాయి.
- ➪ అధిక గాలులకు వేళ్ళతో సహా ఒరిగిన చెట్లను లేపి నిలబెట్టి, మట్టిని ఎగదోసి ఊతమివ్వాలి.

**మామిడి**

- ➪ ఒరిగిన / పడిపోయిన చిన్న చెట్లను లేపి మట్టిని ఎగదోయాలి.
- ➪ విరిగిన కొమ్మలను కత్తిరించి, పైభాగాన బోర్డో పేస్ట్ లేదా కాపర్ ఆక్సీ క్లోరైడ్‌ను పూతగా పూయాలి.
- ➪ చెట్ల మధ్య దున్ని తేమ ఆవిరి అయ్యేలా చూడాలి.
- ➪ చెట్టు ఒక్కటికి 500 గ్రా. యూరియా, 417 గ్రా. మ్యూరేట్ ఆఫ్ పొటాష్ , 25 కిలోల పశువుల ఎరువును వేయాలి.
- ➪ వేర్లను తెగుళ్ళు నుండి కాపాడడానికి కాపర్ ఆక్సీ క్లోరైడ్‌ను 3 గ్రా / లీ చొప్పున మొదళ్ళ వద్ద తడపాలి.
- ➪ పక్షి కన్ను తెగులు, పండు కుళ్ళు వంటి తెగుళ్ళ నివారణకు కార్బండిజమ్ 1 గ్రా / లీ చొప్పున కలిపి పిచికారీ చేయాలి.

**అరటి**

- ➪ తోటలలో నిల్వ ఉన్న నీటిని వీలైనంత త్వరగా బయటకు వెళ్ళదీయాలి.

- ➪ విరిగిన చెట్లను రెండు పిలకలు వదిలి కోసివేయాలి.
- ➪ చెట్లకు వెదురు కర్రలను పాతి ఊతమివ్వాలి.
- ➪ అరటి చెట్టు 4 రోజుల కంటే ఎక్కువ నీటి ముంపుకు గురైతే ఏ వయస్సు తోటలలోనైనా తిరిగి కోలుకోవడం కష్టం.
- ➪ ఒకవేళ కోలుకున్నా తక్కువ ఎదుగుదల, తక్కువ దిగుబడులు వస్తాయి.
- ➪ నీటి ముంపులో తోట 2 రోజులు ఉన్నట్లయితే వీలైనంత



త్వరగా నీరు తీసివేసి, తోటలను ఆరేలా చేసి చెట్టు ఒక్కింటికి 100 గ్రా యూరియా, 80 గ్రా పొటాష్ ఎరువులను వేసుకోవాలి.
- ➪ 3 నెలల వయస్సు కన్నా తక్కువ ఉన్న మొక్కలు 3 అడుగుల లోతు నీటిలో మునిగిపోతే ఆరిన వెంటనే మరలా కొత్త పిలకలను నాటుకోవాలి.
- ➪ గొర్రుతో అంతర సేద్యం చేసి మొక్కకు 100 గ్రా. యూరియా, 80 గ్రా. మ్యూరేట్ ఆఫ్ పొటాష్ 2-3 సార్లు 20-25 రోజుల కాలవ్యవధిలో వేయాలి.
- ➪ ఆకులు, గెలలపై పొటాషియం నైట్రేట్ (13-0-45) (మల్టి-కె) 5 గ్రా/లీటరు నీటికి చొప్పున వారం రోజుల వ్యవధిలో 3 నుండి 4 సార్లు పిచికారి చేయాలి.
- ➪ సగం తయారైన గెల (75% లోపు పక్వానికి వచ్చిన గెల) లను ఎండిన అరటి ఆకులతో కప్పివుంచి 15 రోజుల లోపు కోసి మార్కెట్ చేసుకోవాలి.
- ➪ వెదురు బొంగులతో ఊతమిచ్చి, మొక్కలు పడిపోకుండా చూసుకోవాలి.
- ➪ దుంపకుళ్ళు నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3గ్రా / లీటరు నీటికి కలిపి లేదా బోర్డో మిశ్రమం 1 శాతం మొక్క చుట్టూ తడిచేటట్లుగా నేలలో పోయాలి.
- ➪ సిగటోక ఆకుమచ్చ తెగులును అరికట్టుటకు ప్రొపికొనజోల్ 1 మి.లీ. లేదా మాంకోజెబ్ 2.5 గ్రా/ లీటరు నీటికి కలిపి (1-2 సార్లు 3 వారం రోజుల వ్యవధిలో) పిచికారి చేయాలి.

**బత్తాయి , నిమ్మ**

- ➪ తోటలలో నిలిచిన నీటిని తీసివేసి, పళ్ళాలలో తిరగవేసి వేరు వ్యవస్థకు ఎండ తగిలేలా చేయాలి.
- ➪ పడిపోయిన చెట్లను యధాస్థితికి తెచ్చి, ఊతమిచ్చి కట్టాలి. బయటకు వచ్చిన వేళ్ళపై మట్టిని కప్పి గట్టిగా అదమాలి.
- ➪ విరిగిన కొమ్మలను కత్తిరించి, పైభాగాన బోర్డో మిశ్రమం పోయాలి.
- ➪ 8 సంగలు పైబడి, కాపునిస్తున్న తోటలలో చెట్టుకు 500గ్రా యూరియా, 750గ్రా పొటాష్‌ను వేసుకోవాలి.
- ➪ చెట్టు మొదళ్ళ దగ్గర 1% బోర్డో మిశ్రమం లేదా కాపర్ ఆక్సీ క్లోరైడ్ 3 గ్రా / లీ నీటికి పోయాలి.
- ➪ తోటల్లో కాపు ఉన్నట్లయితే 2-4డి మందును 1 గ్రా. / 100 లీ నీటికి చొప్పున లేదా ప్లానోఫిక్స్ 2.5 మి.లీ/ 10 లీటర్ల నీటికి చొప్పున కలిపి పిచికారీ చేసి పిందె, పండు రాలడాన్ని నివారించుకోవాలి.
- ➪ బెంజైల్ అడినైన్ 50 పిపిఎం పిచికారీ చేయాలి (తద్వారా పత్ర రంధ్రాలు తెరచుకొని, బాష్పోత్సేకం అధికమై నేలలలోని అధిక తేమను నివారించుకోవచ్చు.

**బొప్పాయి**

- ➪ మొక్క మొదళ్ళ దగ్గర ఉన్న నీటిని తీసివేయాలి.
- ➪ మెటలాక్జిల్ ఎం.జడ్ 3గ్రా లేదా కాపర్ ఆక్సీ క్లోరైడ్ 3 గ్రా / లీటరు నీటికి కలిపి మొదళ్ళ దగ్గర పోయాలి.

➪ సూక్ష్మ పోషకాల మిశ్రమాన్ని 5 గ్రా / లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

➪ కోతకు తయారై వున్న కాయలను మార్కెట్‌కి తరలించాలి.

➪ పండు కుళ్ళు నివారణకు హెక్సాకోనజోల్ 2 మి.లీ. లేదా డైఫెన్ కొనజోల్ 0.5 మి.లీ + 0.5 మి.లీ. (స్టికర్) జిగురు మందును కలిపి పిచికారీ చేయాలి.

**జామ**

➪ అధిక నీటిని తీసివేసి గొర్రుతో దున్ని, తేలికగా చెట్టు చుట్టూ త్రవ్వి, పాదులు తయారుచేసుకోవాలి.

➪ చెట్టు మొదళ్ళ దగ్గర కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా / లీ చొప్పున ద్రావణాన్ని పోయాలి.

➪ కాయకోత అనంతరం వచ్చే అంత్రాక్నోస్ తెగులు నివారణకు కార్బండిజమ్ 1 గ్రా / లీ నీటికి కలిపి పిచికారి చేయాలి.

➪ పొటాషియం నైట్రేట్ 10 గ్రా / లీ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

➪ జామలో వడలు తెగులు (విల్ట్) నివారణకు ట్రైకోడెర్మావిరిడి మిశ్రమాన్ని (30 కిలోల పశువుల ఎరువు + 4 కిలోల వేపపిండి + 500 గ్రా ట్రైకోడెర్మావిరిడి / ఒక చెట్టుకు) వెయ్యాలి.

➪ చౌడు ఉన్నట్లయితే 1 కేజీ జిప్సం ఒక చెట్టుకు వెయ్యాలి. కార్బండిజమ్ 1 గ్రా / లీ నీటికి కలిపి మొదళ్ళ దగ్గర పిచికారి చేయాలి.

**దానిమ్మ**

➪ తోటలలో అధికంగా ఉన్న నీటిని తీసివేయాలి. మొదళ్ళ వద్ద మట్టిని తిరగవేయాలి.

➪ చెట్టు మొదళ్ళను కాపర్ ఆక్సీ క్లోరైడ్ 3 గ్రా / లీ నీటికి కలిపిన ద్రావణంతో తడిపి వేర్లు తెగుళ్ళకు గురికాకుండా చూడాలి.

➪ బాక్టీరియా తెగుళ్ళు నివారణకు కాపర్ ఆక్సీ క్లోరైడ్ 30 గ్రా / 10లీ నీటికి, సెప్టోసైక్లిన్ 2.5 గ్రా / 10 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయాలి.

➪ ఎండిపోయిన, తెగుళ్ళు సోకిన కొమ్మలను కత్తిరించి నాశనం చేయడం ద్వారా బాక్టీరియా తెగుళ్ళ ఉధృతిని తగ్గించాలి. కత్తిరించిన భాగాలకు బోర్డో పేస్టును పూయాలి.

**సపోట**

➪ అధికంగా ఉన్న నీటిని తీసివేయాలి.

➪ విరిగిన కొమ్మలను కత్తిరించి, బోర్డో పేస్టును కత్తిరించిన భాగాలకు పూయాలి.

➪ మొదళ్ళ వద్ద నీటిని తిరగవేయాలి.



➪ చెట్టుకు 220 గ్రా యూరియా 115 గ్రా పొటాష్ మరియు 13 కిలోల పశువుల ఎరువును వేసుకోవాలి.

➪ ఆకుమచ్చ తెగులు నివారణకు కాపర్ ఆక్సీ క్లోరైడ్ 3 గ్రా / లీ చొప్పున చెట్టు మొత్తం తడిసేలా పిచికారీ చేయాలి.

**రేగు**

➪ తోటలలో నిలువ ఉన్న నీటిని బయటకు తోసివేయాలి. గొంగళి పురుగుల నివారణకు క్వినాల్ ఫాస్ 2 మిలీ / లీ లేదా క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ / లీ చొప్పున పిచికారీ చేయాలి.

➪ బూడిద తెగులు నివారణకు డైనోకాప్ 1 మి.లీ. / లీ లేదా ట్రైడిమెఫాన్ 1 మి.లీ. / లీ 20 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.

**కూరగాయ పంటలలో ...**

**వివిధ కూరగాయ పంటలలో అధిక వర్షాల ప్రభావం**

| పంట | లక్షణాలు |
|---|---|
| టమాట | మొక్క ఎదుగుదల తగ్గుతుంది. పూత రాలటం, ఎండు తెగులు, ఆకుమచ్చ తెగులు |
| వంగ | ఆకులు పసుపుబారటం, పూత రాలటం, అక్షింతల పురుగు, బాక్టీరియా మచ్చ తెగులు |
| మిరప | నారుకుళ్ళు, ఎండు తెగులు, ఆకుమచ్చ తెగులు, కొయనోఫోరా తెగులు |
| తీగజాతివి | ఆకులు పసుపు బారటం, బూజు తెగులు |
| ఆకుకూరలు | ఆకు తినే పురుగు, ఆకుమచ్చ తెగులు |
| దుంపజాతివి | అధిక శాఖీయోత్పత్తి, దుంప కుళ్ళు |

**యాజమాన్య పద్ధతులు**

- వర్షాలు ఆగిన వెంటనే 19:19:19 లేదా 13:0:45 లేదా యూరియా వంటి పోషకాలను పంటపై పిచికారి చేయాలి.
- అవసరాన్ని బట్టి సూక్ష్మపోషకాలను కూడా పిచికారి చేసి, నేల కొంచెం ఆరిన తరువాత రసాయనిక ఎరువులను నేలలో వేసుకోవాలి
- అధిక వర్షాలకు విత్తనం మొలకెత్తనపుడు లేదా లేత మొక్కలు దెబ్బ తిన్నపుడు నర్సరీలో నారు పెంచుకుని వేసుకోవచ్చు.
- వర్షాలు ఆగిన వెంటనే అంతర సేద్యం చేసి కలుపును తొలగించడమే కాకుండా నేల త్వరగా ఆరేటట్లు చేసుకోవాలి.

  మొక్కలకు ఊతం ఇవ్వడం, పందిళ్ళపై తీగజాతి కూరగాయలను సాగు చేసుకోవడం

**సస్య రక్షణ చర్యలు**

- ఆకుతినే పొగాకు లద్దెపురుగు నివారణకు విషపు ఎరలను ఉపయోగించాలి.(అన్ని కూరగాయ పంటలు)
- అక్షింతల పురుగు, చిత్త పురుగుల నివారణకు వర్షాలు ఆగిన వెంటనే క్లోరిపైరిఫాస్ 2 మి.లీ. / లీ లేదా థయోడికార్బ్ 1 గ్రా / లీ పిచికారి చేసుకోవాలి. (వంగ, కాకర, ఆగాకర)
- ఎండు తెగులు నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా / లీ లేదా మెటాలాక్సిల్ + మంకోజెబ్ 2 గ్రా / లీను మొక్కల మొదళ్ళలో పోయాలి.

  (మిరప, టమాట, క్యాబేజి మొదలగునవి)
- ఆకుమచ్చ తెగుళ్ళ నివారణకు కార్బండిజం 1 గ్రా / లీ లేదా మంకోజెబ్ 2.5 గ్రా / లీను పిచికారి చేసుకోవాలి. (మిరప, టమాట, చిక్కుడు ఆకుకూరలు)

  బూజుతెగులు నివారణకు డైమిథోమర్ఫ్ 1.5 గ్రా / లీ లేదా మెటాలాక్సిల్ + మంకోజెబ్ 2.0 గ్రా / లీను పిచికారీ చేసుకోవాలి. (బీర, కాకర, దోస, పొట్ల, సొర)
- బాక్టీరియా మచ్చ తెగులు నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా/లీ + ప్లాంటామైసిన్ 0.2 గా/లీ కలిపి పిచికారి చేసుకోవాలి. (టమాట, వంగ, క్యాప్సికం)

**హార్మోన్ల వినియోగం**

- నీటి ముంపు సమయంలో జిఎ2 మరియు బిఎపి పిచికారి చేసుకుని నీటిముంపు ప్రభావాన్ని తగ్గించుకోవచ్చు.
- ఎన్ఎఎ పిపిఎం పిచికారి చేసుకుని పూత పిందె రాలటం అరికట్టవచ్చు.
- నేలలో తేమ ఎక్కువగా ఉన్నపుడు సాలిసిక్ యాసిడ్ 100 పిపిఎం పిచికారి చేసుకుని మొక్కలో నిలువ ఉన్న పోషకాల వినియోగాన్ని పెంపొందించవచ్చు.
- బ్రసినొలైడ్ 0.5 పిపిఎం పిచికారి చేసుకుని కిరణజన్య సంయోగక్రియ పెంపొందించవచ్చు.

**పూల తోటలలో ...**

**రక్షిత గృహాలలో తీసుకొనవలసిన జాగ్రత్తలు**

- సాధారణంగా రక్షిత గృహాలలో వాతావరణాన్ని బట్టి గాలిలో తేమ శాతం పెరుగుతుంది లేదా తగ్గుతుంది.

ప్రతి రోజూ తెల్లవారేసరికి రెండు మార్గాలు; ఇంకా నిద్రిస్తూ కలలు కనడమా? లేచి ఆ కలల సంగతి తేల్చడమా?

- బయలు ప్రాంతంలో కూడా ప్రాంతాన్ని బట్టి గాలిలోని తేమ శాతం వాతావరణాన్ని బట్టి మారుతుంది
- ఎండ పెరిగేకొద్దీ గాలిలో తేమ శాతం తగ్గుతుంది. వేడి గాలిలో తేమ శాతం తక్కువగాను, చల్లటి వాతావరణంలో ఎక్కువగాను ఉంటుంది.
- నీరు పెట్టడంలో జాగ్రత్తలు, నీరు నిలవకుండా చేయడం, మురుగునీరు బయటకు పోయేందుకు తగిన వసతి కల్పించాలి.
- మొక్కల మధ్య తగినంత దూరం వుండేలా చూసుకోవడం.
- నీరు ఉదయం పెట్టడం వలన సాయంత్రానికి మొక్కల మీద తేమ శాతం తగ్గుతుంది
- సాధారణంగా మొక్కల మధ్య దూరం తక్కువగా ఉన్నపుడు మొక్కల మధ్య భాగంలో భూమికి దగ్గరగా తేమ శాతం పెరుగుతుంది. మరియు ఎప్పుడైతే నీటి ఆవిరి వాతావరణంలోకి వెళ్ళేందుకు ఆస్కారం ఉండదో అప్పుడు మొక్కల చుట్టూ తేమశాతం పెరిగి తెగుళ్ళ ఉధృతి పెరిగేందుకు అవకాశం ఉంది.
- స్లిన్గ్ సైక్రోమీటర్ (గాలిలో తేమ శాతం) కానీ డేటా లాగర్లు (ఉష్ణోగ్రత మరియు గాలిలో తేమ శాతం) కానీ ఉపయోగించి వాతావరణ పరిస్థితులను తెలుసుకొనవచ్చును.
- బయలు ప్రాంతంలో స్టీవెన్ సన్ స్క్రీన్ లో డేటా లాగర్లను ఉంచి కూడా పరిస్థితులను తెలుసుకోవచ్చు.

**జాగ్రత్తలు**

- రక్షిత గృహాలు గంటకు 120 నుండి 140 కిలోమీటర్ల గాలి వేగాన్ని తట్టుకునేలా నిర్మించుకోవాలి.
- గాలి వేగంగా వీచేటపుడు గాలి ప్రసరించేందుకు ఏర్పాటు చేసిన ప్రక్క తెరలను మరియు ద్వారాలను మూసివేయాలి.
- సహజ కాంతి
- ఇందుకోసం వర్షాకాలం మొదలుకాకముందే ప్లాస్టిక్ పరదాలపై ఉన్న దుమ్ముధూళిని శుభ్రపరచుకోవాలి. లేదా తక్కువ వెలుతురు లోపలికి వచ్చి మొక్కలు సరిగా పెరగవు. మరీ చాలాకాలం మబ్బులు పట్టి వెలుతురు లేని పక్షంలో కృత్రిమ కాంతిని మొక్కలకు పరిస్థితులను బట్టి మనం పెంచుతున్న మొక్కలను బట్టి మొక్కల వయసును బట్టి అంచనా వేసికొని వాతావరణ పరిస్థితులు కల్పించాలి.

**గాలి ప్రసరణ**

- వర్షాకాలంలో పక్క తెరలను తెరచి ఉంచాలి. ఇందువలన పాలీ హౌస్‌లలో గాలిలో తేమ శాతం పెరగకుండా ఉండేందుకు ఉపయోగపడుతుంది. ఒకవేళ వర్షంతోపాటుగా గాలి కూడా ఉన్నట్లయితే పక్క తెరలను సగం మాత్రం మూసివేయాలి. ఈ కాలంలో గాలి లోని తేమ శాతం బయటికి పోయేందుకు ఎక్జాస్ట్ ఫాన్‌లను ఉపయోగించవచ్చు.

**పాలీ హౌస్**

- పాలీ హౌస్ మరియు షేడ్ నెట్ హౌస్‌ల దగ్గర ఉన్న పెద్ద చెట్ల కొమ్మలను గమనించి వాటిని కత్తిరించు కోకపోతే అవి పాలీ హౌస్ పైన పడి నష్టం జరగవచ్చు.



- స్టోరేజ్ రూమ్‌లలో ఉన్న ఎరువులను మరియు తేమకు నష్టపోయే వాటిని జాగ్రత్తపరచాలి.
- వర్షపు నీటిని నిలువ వుంచుకునేందుకు తగిన స్టోరేజ్ ట్యాంకులను రెడీ చేసుకోవాలి.

**బయలు ప్రాంత పూల తోటలకు**

- ఎత్తు మడుల పద్ధతి పాటించాలి.
- మడుల మధ్య నడవకూడదు.
- మొక్కల మధ్య రేకింగ్ (భూమిని వదులు) చెయ్యాలి. అవసరమైతే కొన్ని మొక్కలను తీసివేయాలి. ఇందువలన గాలి బాగా ప్రసరించి తెగుళ్ల బారిన పడకుండా ఉంటాయి.
- మొక్కల మధ్య దిన పత్రికల కాగితాలు ఉంచాలి. దీనివలన వర్షం నీరు వలన పైకి ఎగిరే మట్టి ఆకుల మీద పడకుండా చేయవచ్చు. దీనివలన తెగుళ్ళు తగ్గుతాయి.
- వాతావరణానికి సంబంధించిన వార్తలను ఎప్పటికప్పుడు తెలుసుకొని తగిన జాగ్రత్తలు ముందే తీసుకోవాలి.
- తెగుళ్ళ మందులను వర్షం పడే ముందుగానే పిచికారీ చెయ్యాలి.
- పొలంలో నీరు నిలువకుండా చెయ్యాలి.
- పొలంలో వాలును గమనించి నీటిని నిలువ చేసుకోవచ్చు.
- వర్షం పడిన తరువాత ఎరువులు వేయరాదు.
- మొదలు కుళ్ళును గమనించి తగిన తెగుళ్ళ మందులను పాదులలో పోసుకోవాలి.
- పంటకు తగ్గట్టుగా కొమ్మల కత్తిరింపులు చేసుకోవాలి.
- కరెంటు తీగలను గమనించి పొలం పనులు చేసుకోవాలి.
- వర్షం పడ్డ తరువాత విషపూరిత జీవులు (తేళ్ళు, పాములు) పొలంలోని బొరియల నుండి బయటకు వస్తాయి కావున జాగ్రత్తపడాలి. వీలైతే షూ వేసుకోవడం ఉత్తమం.
- విద్యుత్ పరికరాలను జాగ్రత్తపరచాలి.

**చామంతి**

- ఎత్తుమడులను ఏర్పాటు చేసుకుని మొక్కలను నాటుకోవాలి.
- నారును తెగుళ్ళ మందు ద్రావణంలో ముంచి పొలంలో నాటుకోవాలి.
- చామంతికి ఎక్కువగా పుసేరియం వడలు తెగులు (పుసేరియం ఆక్సీస్పోరుమ్), తుప్పు తెగులు (పుస్సినియ క్రైసంతిమి), ఆకుమచ్చ తెగులు (సెప్టోరియా క్రైసాంతిమెల్లా) మొదలు కుళ్ళు తెగులు (పుసేరియం సోలానీ)
- బూడిద తెగులు (అఇడం క్రైసంతిమి) వంటి తెగుళ్ళు వస్తాయి.

**చామంతి**

- పుసేరియం వడలు తెగులు (నేల శుద్ధి) (మొక్కల మొదళ్ళ వద్ద మందు ద్రావణం పోయాలి)
- కార్బండజిమ్ – 1 గ్రాము ఒక లీటరు నీటికి
- థైరం – 1.5 గ్రాము ఒక లీటరు నీటికి
- తుప్పు తెగులు : సల్ఫర్ 0.2% డస్ట్
- ఆకుమచ్చ తెగులు : కార్బండజిమ్ – 1 గ్రాము ఒక లీటరు నీటికి
- మొదలు కుళ్ళు తెగులు : బావిస్టిన్ – 1 గ్రాము ఒక లీటరు నటికి
- బూడిద తెగులు : సల్ఫర్ – 2 గ్రాములు ఒక లీటరు నీటికి

**చామంతిలో, బంతిలో ఊతమివ్వడం**

**బంతి**

- ఆకుమచ్చ తెగులు : కార్బండజిమ్ – 1 గ్రాము ఒక లీటరు నీటికి
- వేరు కుళ్ళు : కార్బండజిమ్ – 1 గ్రాము ఒక లీటరు నీటికి (మొక్కల మొదళ్ళ వద్ద మందు ద్రావణం పోయాలి)
- పువ్వు మొగ్గలు కుళ్ళు రోగం : డైథెనియం ఎం–45 2 గ్రాములు ఒక లీటరు నీటికి
- బూడిద తెగులు : సల్ఫర్ – 2 గ్రాములు ఒక లీటరు నీటికి

■

అన్ని ప్రయత్నాలూ ఫలితాన్ని ఇవ్వకపోవచ్చు, కాని ప్రయత్నమే లేనిది ఏ ఫలితమూ రాదు కదా!

# ప్రాంతీయ ఉత్తమ సమాఖ్యలకు అవార్డుల బహూకరణ దృశ్యాలు















## మరికొందరు ప్రముఖులకు సన్మానాలు






MAHILA SADHIKARATHA
Publication Date: 01-12-2021; Posting Date: 05 & 06-12-2021

RNI Regd No: TELTEL / 2003 /16365
Postal Regd No: HD/1064/2021-23





జాతీయ ఉత్తమ మహిళా సమాఖ్యలకు అవార్డుల ప్రదాన దృశ్యాలు











జాతీయ కార్యశాలలో పాల్గొన్న ప్రముఖుల సన్మాన దృశ్యాలు







బట్వాడా కాకపోతే దయచేసి
ఈ చిరునామాకు తిప్పిపంపండి

ఎడిటర్, ఏపిమాస్ కార్యాలయం, ప్లాట్ నెం.11-12, హుడా కాలని, తానీషా నగర్,
డ్రీమ్ వ్యాలీ దగ్గర, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089